News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక
Website cknewstv.in

సంపుటి : 05 | సంచిక :252 | ఖమ్మం | గురువారం, అక్టోబర్ 15, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad




# పెట్టుబడులు పెట్టండి

- మీ పెట్టుబడులకు మా పూర్తి భద్రత
- పరిశ్రమలకు సత్వర అనుమతులు
- ప్రభుత్వం పరంగా పూర్తి సహకారం
- మా ప్రభుత్వానికి నో పాలసీ పెరాలసిస్
- ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తెలంగాణ
- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీ
- ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాం
- మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం
- గ్లోబల్ స్థాయికి రాష్ట్ర పారిశ్రామికవేత్తలు
- పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్ హామీ
- హైటెక్స్‌లో సమాఖ్య బిజినెస్ సమ్మిట్



"దేశ, విదేశాల నుంచి వస్తున్న పెట్టుబడుల ద్వారా యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషిచేస్తున్నాం. సత్య నాదెళ్ల లాంటి వారు గ్లోబల్ కంపెనీలకు సీఈవోలుగా అత్యున్నత సేవలు అందిస్తున్నారు. కానీ వారు ఆ సంస్థలకు యజమానులు



కారు. బహుళజాతి కంపెనీలకు సేవలందించే స్థాయి నుంచి మన యువత సంస్థలను స్థాపించి యజమానులుగా ఎదగాలి. స్టైరూట్ తరహాలో మన రాష్ట్రం నుంచి మరిన్ని స్టార్టప్ కంపెనీలు పుట్టుకు రావాలి"
- రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 2034 నాటికి రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026 ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. 2047 నాటికి భారత్ స్వాతంత్ర్యం సాధించి 100 ఏళ్లు పూర్తిచేసుకోనుందని సీఎం రేవంత్ గుర్తుచేశారు. వివరాలు 2లో..

అధికారుల తీరు

# మారడం లేదు

- పదేపదే చెప్పినా పరిస్థితి మారలేదు
- నిర్లక్ష్యం చేస్తే వ్వారిని సస్పెండ్ చేస్తా
- సరఫరా సాఫీగా సాగేలా చర్యలుండాలి
- పంటలు ఎండకుండా సరఫరా చేయాలి
- ఎల్‌నినోపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- కరెంట్ కోతలపై రేవంత్ రెడ్డి ఆగ్రహం
- ఎల్‌నినో, కరవు పరిస్థితులపై సమీక్ష
- వర్షాభావ పరిస్థితులపై తగు సూచనలు

తెలంగాణలో తరచూ తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల పనితీరుపై ఆయన నిప్పులు చెరిగారు. ఎన్నిసార్లు ఆదేశాలు ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సీఎం, అధికారులు తమ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని, ఉన్నతస్థాయి అధికారులను సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోనని గట్టి హెచ్చరిక జారీ చేశారు. బుధవారం విద్యుత్ సరఫరా పరిస్థితిపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి, అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ, ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు పూర్తిస్థాయిలో లింకేజీలు ఉన్నప్పటికీ, విద్యుత్ ఉత్పత్తి ఆశించిన మిగతా 2లో..

# 78 రోజుల వేతనం బోనస్!

రైల్వే ఉద్యోగులకు దీపావళి కానుక

11,40,770 మంది ఉద్యోగులకు బోనస్

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం



కేంద్ర మంత్రివర్గం బుధవారం మూడు కీలక నిర్ణయాలను ప్రకటించింది. పండుగల సీజన్‌కు ముందు రైల్వే ఉద్యోగులకు ఒక ముఖ్యమైన కానుకను ప్రకటించడం కూడా ఈ నిర్ణయాలలో ఒకటి. ఈ సందర్భంగా రైల్వే ఉద్యోగులకు పండగ కానుకను అందించారు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్. సుమారు 11,40,770 మంది రైల్వే ఉద్యోగులకు 78 రోజుల పనితీరు ఆధారిత బోనస్‌ను ఆమోదించినట్లు వెల్లడించారు. పగలు, రాత్రి అవిశ్రాంతంగా పనిచేసే కష్టజీవులైన రైల్వే ఉద్యోగులకు మిగతా 2లో..

# రికార్డు స్థాయిలో ట్రాఫిక్ ఉల్లంఘనలు

32 నెలల్లో 3.77 కోట్ల కేసులు నమోదు

భారీ స్థాయిలో పెండింగ్‌లో చలాన్లు



తెలంగాణలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గత 32 నెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 3 కోట్ల 77 లక్షల ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రతిరోజూ వేలాది సంఖ్యలో కేసులు నమోదవుతున్నప్పటికీ వాహనదారుల ప్రవర్తనలో వివరాలు 2లో..

# స్టార్‌లింక్ గొర్రె తోలుతో ఉన్న తోడేలు

స్టార్‌లింక్‌తో దేశభద్రతకు ముప్పు

కుట్నీతి సంచలన నివేదిక విడుదల




ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ పట్ల భారత్ అప్రమత్తంగా ఉండాలని దిల్లీకి చెందిన థింక్ ట్యాంక్ కుట్నీతి ఫౌండేషన్ హెచ్చరించింది. దీని విషయంలో భారత్ కచ్చితంగా రక్షణాత్మక విధానాన్ని అవలంబించాలని సూచించింది. భారతదేశంలో కమర్షియల్ శాటిలైట్ కమ్యూనికేషన్ అంశంపై ప్రస్తుతం తీవ్రమైన చర్చ జరుగుతోంది. స్పేస్ ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్, తమ స్టార్‌లింక్‌కు రావాల్సిన లైసెన్సులను భారత్ లోని కొన్ని శక్తులు అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. ఒకవేళ లైసెన్సులు వస్తే, ఇంటర్నెట్ సౌకర్యం లేని వెనుకబడిన ప్రాంతాలకు స్టార్‌లింక్ సేవలు అందిస్తుందని, తాము పరోపకార దృక్పథంతో పనిచేస్తామన్నారు. అయితే ఆయన ఆరోపణలను భారత సమాచార, ప్రసార వివరాలు 2లో..



వాటాలు కుదరకే

# నైనీ టెండర్ల రద్దు

- టెండర్లలో10 వేల కోట్ల స్కామ్ జరిగింది
- కుంభకోణంపై కేంద్రాని విచారణ కోరాం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాశాం
- సింగరేణిని దివాళా తీయించే కుట్ర
- సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదు
- కుంభకోణాలు వారే బయటపెట్టుకుంటున్నారు
- సింగరేణి లాభాల్లో 6,317 కోట్లు మింగేశారు
- వాటాలను కొట్టేసిన కొడంగల్ కొండచిలువ
- కార్మికుల సొమ్ము దాచిపెట్టి దోచుకుంటోంది
- రాష్ట్ర ప్రభుత్వంపై మాజీమంత్రి కేటీఆర్ ఫైర్
- గోదావరిఖనిలో బీఆర్ఎస్ సింగరేణి కార్మిక గర్జన



సింగరేణిని దివాళా తీయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మాజీమంత్రి కేటీఆర్ ఆరోపించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన పాల్గొన్న కేటీఆర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు గుప్పించారు. సింగరేణికి రావాల్సిన నైనీ బొగ్గుగనిలో వాటాలు కుదరక కుంభకోణాలు బయటపడ్డాయని పేర్కొన్నారు. 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా వివరాలు 2లో..

# ఇంటికి అదనంగా 72,000 ఆర్థిక సాయం!

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తీపికబురు..

ప్రధాన మంత్రి ఆవాస్ యోజనతో అనుసంధానం

తెలంగాణలో పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ప్రతిష్టాత్మక 'ఇందిరమ్మ ఇళ్లు' పథకానికి సంబంధించి మరో కీలక నిర్ణయం వెలువడింది. ఈ స్కీమ్‌ను కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన రూరల్ పోర్టల్‌తో అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ద్వారా లబ్ధిదారులకు అదనపు ఆర్థిక భరోసా లభించనుంది. పీఎం ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద తెలంగాణకు మిగతా 2లో..



పేదలు నివసించే ప్రాంతాల్లోనే

# ఇందిరమ్మ ఇండ్లు

మొదటి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణం చేపడుతాం

ఇళ్లు అందించడంలో ఎలాంటి వివక్షకు తావులేదు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన

తెలంగాణ ప్రభుత్వం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చెపట్టిన ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వివరాలు 2లో..

## అట్టుడుకుతున్న పశ్చిమాసియా!

యుద్ధ అగ్నికీలలు ఎంత ఆర్పినా ఆరని స్థితికి చేరాయి. పలు దేశాల మధ్య నెలకొన్న వివాదాల మధ్య యుద్ధం అనివార్యం కాగా ఆ మంటలు ఇంకా రగులుతూనే ఉన్నాయి. తాజాగా సౌదీ అరేబియాపై హూతీ రెబల్స్ దాడులు ఆగడం లేదు. సౌదీలోని ప్రధాన విమానాశ్రయాలపై వరుస దాడులు చేస్తోన్న హూతీలు, తాజాగా దమ్మామ్‌లోని కింగ్ ఫహాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుపై క్షిపణులతో విరుచుకుపడ్డారు. పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. సౌదీ అరేబియా, యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు మరింత ముదిరాయి. సౌదీ రాజధాని రియాద్‌ను లక్ష్యంగా చేసుకుని హౌతీలు వరుసగా మూడో రోజు క్షిపణి దాడులకు పాల్పడింది. మరోవైపు, యెమెన్ రాజధాని సనాలోని చమురు సంస్థలను లక్ష్యంగా చేసుకుని సౌదీ నేతృత్వంలోని కూటమి వైమానిక దాడులు జరిపాయి. ఈ పరిణామాలతో ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. యెమెన్‌లోని సనాలో చమురు సంస్థలను లక్ష్యంగా చేసుకుని సౌదీ కూటమి జరిపిన వైమానిక దాడులతో ఆ ప్రాంతంలో దట్టమైన నల్లటి పొగ ఆకాశంలోకి ఎగసిపడింది. అయితే, ఈ దాడుల కారణంగా చమురు నిల్వలకు ఎలాంటి ముప్పు వాటిల్లలేదని హౌతీలు ప్రకటించారు. దాడుల్లో జరిగిన నష్టం, ఇతర వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు, సౌదీ రాజధాని రియాద్‌పై హౌతీలు వరుసగా మూడో రోజు క్షిపణి దాడులకు పాల్పడినట్లు సమాచారం. అయితే, హౌతీలు ప్రయోగించిన క్షిపణులను తమ రక్షణ వ్యవస్థలు అడ్డుకుని కూల్చివేశాయని సౌదీ కూటమి వెల్లడించింది. ఈ దాడుల్లో ఇప్పటివరకు 14 మంది మరణించినట్లు సమాచారం. భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని శనివారం వరకు మూసివేసినట్లు సమాచారం. అలాగే, భద్రతా కారణాలతో పలు అంతర్జాతీయ విమానాలను రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు ప్రయాణికులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. విమానాశ్రయం పునఃప్రారంభం, విమాన సర్వీసుల పునరుద్ధరణపై అధికారిక ప్రకటనలు కీలకంగా మారాయి. సౌదీ అరేబియాలోని చమురు కేంద్రాలు, విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుంటామని హౌతీలు హెచ్చరించినట్లు సమాచారం. ఈ ఘర్షణల్లో అమెరికా జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా హెచ్చరించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ వివాదం సౌదీ అరేబియా, యెమెన్‌లకే పరిమితం కాకుండా మరింత విస్తరించే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌తో అనుసంధానించే కీలకమైన బాబ్ ఎల్-మండెబ్ జలసంధి సమీపంలోనూ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయ సముద్ర వాణిజ్యానికి ఈ జలసంధి ఎంతో కీలకం. ఇక్కడ పరిస్థితులు మరింత దిగజారితే నౌకాయానం, చమురు రవాణా, ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం పడే అవకాశం ఉంది. మొత్తంగా, రియాద్‌పై క్షిపణి దాడులు, సనాలో చమురు సంస్థలపై వైమానిక దాడులు, అంతర్జాతీయ విమానాల రద్దు, కీలక సముద్ర మార్గం వద్ద ఉద్రిక్తతలు పశ్చిమాసియా పరిస్థితులను మరింత సంక్లిష్టంగా మార్చాయి. ఇరు పక్షాల మధ్య ఘర్షణలు కొనసాగితే ప్రాంతీయ భద్రతతో పాటు ప్రపంచ ఇంధన సరఫరాలపైనా ప్రభావం పడే అవకాశం ఉంది. కాగా వరుస దాడులకు పాల్పడుతుండటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. హూతీలు చాలా దారుణంగా వ్యవహరిస్తున్నారని, వారి చర్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని వ్యాఖ్యానించారు. హూతీలపై అమెరికా ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే ప్రశ్నకు ట్రంప్ సమాధానమిస్తూ, వారు చాలా దారుణంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. అమెరికా మధ్యంతర ఎన్నికల నేపథ్యంలోనే హూతీల దాడులు పెరిగాయా? అని విలేకరులు ప్రశ్నించగా, ఎన్నికలపై ఈ పరిణామాల ప్రభావం ఎలా ఉంటుందో తనకు తెలియదని చెప్పారు. ఆ అంశాన్ని తాను పరిగణనలోకి తీసుకోవడం లేదని స్పష్టం చేశారు. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యంపై ట్రంప్ మరోసారి తన వైఖరిని పునరుద్ఘాటించారు. ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదని, ఆ దేశం అణుబాంబును తయారు చేసుకోకుండా చూస్తామని వ్యాఖ్యానించారు. అదే సమయంలో హూతీల దాడులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సౌదీ అరేబియాలోని కీలక విమానాశ్రయాలపై ఇటీవల దాడులు జరగడం ప్రాంతీయ భద్రతపై ఆందోళనలను పెంచింది. ముఖ్యంగా రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకున్న దాడి తీవ్ర కలకలం రేపింది. ఈ నేపథ్యంలో హూతీలకు వ్యతిరేకంగా సౌదీ అరేబియా చేపట్టే సైనిక చర్యల్లో అమెరికా తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉండగా శనివారం వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడిన ట్రంప్, రియాద్ విమానాశ్రయంపై జరిగిన తాజా దాడి గురించి తమకు సమాచారం అందిందని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు పరిస్థితులను సమీక్షిస్తామని చెప్పారు. అయితే అమెరికా ఎలాంటి చర్యలు చేపడుతుందనే విషయంపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. దీంతో అమెరికా నేరుగా సైనిక చర్యలకు దిగుతుందా? లేక సౌదీకి ఇతర మార్గాల్లో సహకరిస్తుందా? అనేది వేచి చూడాలి. ఒకవేళ ఈ పరిణామాలపై ట్రంప్ జోక్యం చేసుకొని సామరస్య వాతావరణం తీసుకువస్తే మంచిదని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

## ఇంటికి అదనంగా 72,000 ఆర్థిక సాయం!

మొదటిపేజీ తరువాయి..

మంజూరైన ఇళ్లకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఇందుకు రూ.72,000 చొప్పున సాయం అందించనుంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సహాయానికి తోడు, ఈ కేంద్ర నిధులు కూడా తోడవడంతో లబ్ధిదారులకు మరింత వెసులుబాటు కలగనుంది. ఇవే కాకుండా స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణ నిధులు, ఉపాధి హామీ పథకం కింద పనిదినాల వేతనాలు కూడా అదనంగా అందనున్నాయి. ఈ పథకం ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేలా రెండు విడతలుగా లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. తొలి దశలో ఇప్పటికే గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న, నిర్మాణంలో ఉన్న లబ్ధిదారుల వివరాలను పీఎం ఆవాస్ యోజన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇక రెండో విడతలో గుడిసెలు, తాత్కాలిక ఇళ్లలో జీవిస్తున్న మరో 25 వేల మంది పేదలను గుర్తించి వారి వివరాలను నమోదు చేయనున్నారు. ఈ డేటా ఎంట్రీ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా అదనపు ఆర్థిక సహాయం జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సాయంతో పాటు కేంద్రం నుంచి అందే ఈ అదనపు నిధుల వల్ల పేదలకు ఇళ్ల నిర్మాణం మరింత సులువు కానుంది.

## 78 రోజుల వేతనం బోనస్!

మొదటిపేజీ తరువాయి..



ఈ బోనస్ ఒక దీపావళి కానుక. మనం మన కుటుంబాలతో పండుగలు జరుపుకుంటుండగా, ఈ ఉద్యోగులు పొలాల్లో, రైల్వే ట్రాక్‌లపై, ఇంజిన్ల లోపల, వర్క్‌షాపులలో 24 గంటలూ తమ అత్యుత్తమ పనితీరును కనబరుస్తూనే ఉంటారని ఆయన అన్నారు. ఈ బోనస్ మొత్తం సుమారు రూ.2,009 కోట్లు" అని అన్నారు. అయితే ఈ బోనస్‌ను సాధారణంగా ప్రతి సంవత్సరం దుర్గా పూజ లేదా దసరా సెలవులకు ముందు రైల్వే ఉద్యోగులకు ఇస్తారు. 78 రోజుల జీతానికి సమానంగా ఉండే ఈ బోనస సుమారు 10.91 లక్షల మంది ఉద్యోగులకు ఇవ్వనున్నారు. అయితే రైల్వే ఉద్యోగులు రూ.7,000 కనీస జీతం ఆధారంగా లెక్కించిన 78 రోజుల జీతానికి సమానమైన బోనస్‌ను పొందుతారు. తత్ఫలితంగా వారు రూ.17,951 అందుకుంటారు. ఈ కనీస జీత పరిమితి 2014-15 నుండి మారలేదు. దీని ఫలితంగా ఇంకా 11 సంవత్సరాల బోనస్ మిగిలి ఉంది. పలు రైల్వే కార్మిక సంఘాలు, బోనస్ లెక్కింపు కోసం కనీస వేతన పరిమితిని రూ.7,000 నుండి కనీసం రూ.18,000కు పెంచాలని డిమాండ్ చేశాయి. దీని ఆధారంగా వారి బోనస్ మొత్తం రూ.46,184గా ఉంది.




# పెట్టుబడులు పెట్టండి

మొదటిపేజీ తరువాయి

వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉండాలని, అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ లక్ష్యంతోనే 2025లో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసినట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. చార్మినార్ తర్వాత హైదరాబాద్‌లో వ్యాపార అభివృద్ధికి హైటెక్ సిటీ మరో కీలక కేంద్రంగా మారిందని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణకు చెందిన పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టి అంతర్జాతీయ స్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. నూతన పారిశ్రామిక విధానంలో భాగస్వాములు కావాలని వ్యాపారవేత్తలకు పిలుపునిచ్చారు. ఆర్థికాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కీలకమని సీఎం అన్నారు. తెలంగాణలో మహిళలకు రూ.61 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్ల నిర్వహణలో మహిళలను యజమానులుగా ప్రోత్సహిస్తున్నామని వివరించారు. యువతతో పాటు మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు సూచించారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని, మంచి విధానాలను కొనసాగిస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యంగా ప్రభుత్వం, పారిశ్రామికవేత్తలు కలిసి కట్టుగా ముందుకు సాగాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పెట్టుబడులు పెట్టే యువ పారిశ్రామికవేత్తలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆహ్వానం పలుకుతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. కొత్త పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి, రాయితీలు, ప్రోత్సాహకాలతో సమగ్ర విధానం రూపొందించిందన్నారు. తెలంగాణను మూడు ఎకనామిక్ జోన్లుగా అర్బన్, పెరి-అర్బన్, రూరల్ విభజించి అభివృద్ధి చేస్తామన్నారు. సర్వీస్, తయారీ, వ్యవసాయ రంగాలకు సమప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి తెలిపారు. దేశ జనాభాలో రాష్ట్ర వాటా 2.5 శాతమే అయినా జీడీపీలో 5 శాతం తెలంగాణ నుంచే అందిస్తున్నామని చెప్పారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పెట్టుబడులు, కచ్చితమైన ప్రణాళికలు, పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతోనే ఈ లక్ష్యాల సాధన సాధ్యమని సీఎం పేర్కొన్నారు. వ్యక్తులుగా కంటే అందరూ ఒక కమ్యూనిటీగా ఏకమైతేనే యువతకు మరింత బలమని అభిప్రాయపడ్డారు. మహిళల భాగస్వామ్యం ఉన్నప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళా సాధికారత, ఉపాధి కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం మాత్రమే కాకుండా ఆ సంస్థకు 1,000 బస్సులను అద్దెకు ఇచ్చే యజమానులుగా మహిళా సంఘాలు ఎదిగాయన్నారు. కార్పొరేట్ దిగ్గజాలకు ధీటుగా మహిళా సంఘాల ద్వారా 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి, జెన్‌కోకు సరఫరా చేస్తున్నారన్నారు. ప్రతి జిల్లాలోనూ మహిళా సంఘాలకు భూములు కేటాయించి, పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలు అప్పగించామన్నారు. శిల్పారామం వద్ద 3.5 ఎకరాల్లో ఇందిరా మహిళా శక్తి బజార్ల ఏర్పాటు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్‌కు వేదిక అని రేవంత్ రెడ్డి తెలిపారు. యువతతో పాటు మహిళా పారిశ్రామికవేత్తలను కూడా సమాఖ్య ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వం పరంగా పూర్తి మద్దతిస్తామని ఆయన పేర్కొన్నారు. పారిశ్రామిక అభివృద్ధిలో రాజకీయాలకు తావులేదన్నారు. గత 30 ఏళ్లుగా ఉన్న మంచి విధానాలను తమ ప్రభుత్వం మార్చలేదని గుర్తుచేశారు. 'తెలంగాణలో మీ పెట్టుబడులకు పూర్తి భద్రత, లాభం, సత్వర అనుమతులు ఉంటాయి రండి మాతో కలిసి ఎదగండి' అని పారిశ్రామిక వేత్తలకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

### అధికారుల తీరు
# మారడం లేదు



మొదటిపేజీ తరువాయి..

స్థాయిలో ఎందుకు జరగడం లేదని నిలదీశారు. "పదేపదే చెప్పినా మీలో చలనం రావడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? ఇదే నిర్లక్ష్యం కొనసాగితే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ చీఫ్ సెక్రటరీ), జెన్‌కో సీఎండీ సహా ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. విద్యుత్ కోతలకు గల కారణాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని, సరఫరాను సాధారణ స్థితికి తెచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మేయర్ల ప్రతినిధి బృందం కలిసింది. ఈ సమావేశంలో తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా హెల్త్‌కేర్, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్, పరిశోధన, తయారీ రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను సీఎం వారికి వివరించారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార అనుకూల వాతావరణం ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా "యూకే-ఇండియా సీఈటీఏ అండ్ రీజనల్ సినర్జీస్" అనే అంశంపై యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను సీఎం ఆవిష్కరించారు. అనంతరం, డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026"కు హాజరు కావాల్సిందిగా యూకే ప్రతినిధులను ఆయన సాదరంగా ఆహ్వానించారు.



### పేదలు నివసించే ప్రాంతాల్లోనే
# ఇందిరమ్మ ఇండ్లు



మొదటిపేజీ తరువాయి..

ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి తదితర నేతలు పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం పార్టీల తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని సమానం చూస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ఉన్నా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడంలో ఎలాంటి వివక్షకు తావులేదని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ, పేదలు నివసించే ప్రాంతాల్లోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి పొంగులేటి అన్నారు. నగరంలో జీవనోపాధి పొందుతున్న పేదలను దూర ప్రాంతాలకు తరలించి వారి ఉపాధికి ఇబ్బందులు కలిగించే విధానానికి స్వస్తి పలుకుతున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో మొదటి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, 23 నియోజకవర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించారు. ఇప్పటికే ఆరు చోట్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని వివరించారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఇప్పటికే సొంత ఇల్లు ఉన్నవారిని గుర్తించి, అర్హతలను ధ్రువీకరించిన అనంతరం పారదర్శకంగా డ్రా నిర్వహించామని చెప్పారు. ఎంపికైన వారిలో స్థానికంగా నివసించే అర్హులనే నిర్ధారించి ఇళ్లు కేటాయిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ టవర్స్ కోసం మరోసారి దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ టవర్స్‌లో ఎంపికైన లబ్ధిదారులకు కేవలం కేటాయింపు పత్రాలు ఇచ్చి సరిపెట్టబోమని ఎలాంటి రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసి అందిస్తామని మంత్రి ప్రకటించారు. ప్రతి అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్‌లో పొందుపరుస్తామని తెలిపారు. వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి చేసి, వారికి తాళాలు అందించాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులతో సహా అర్హులందరినీ పరిశీలిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంతో పాటు, ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని చెప్పారు.

## నార్లాపూర్ రిజర్వాయర్లలోకి నీటి విడుదల

నాగర్‌కర్నూల్ జిల్లాలో నార్లాపూర్ పంప్ హౌస్‌లో రెండో పంపును మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. రెండు బాహుబలి మోటార్లతో నార్లాపూర్ రిజర్వాయర్లలోకి నీటి ఎత్తిపోత ప్రారంభమైంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలలోని కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు చేసి బాహుబలి పంప్‌లను ప్రారంభించారు. దక్షిణ తెలంగాణకు సాగునీరందించే లక్ష్యంతో చేపట్టిన కీలకమైన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో కీలక ఘట్టం ఆవిష్కృతం అయింది. ప్రాజెక్టులోని తొలి పంప్ హౌస్‌లోని 2 బాహుబలి మోటార్లను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారికంగా ప్రారంభించారు. శ్రీశైలంలో నీటి మట్టం రోజురోజుకు పడిపోతుండటంతో నార్లాపూర్‌లో నీటిని ఎత్తిపోసి నిల్వ చేసేందుకు పాలమూరు రంగారెడ్డిలోని రెండు పంపులను మంత్రి ప్రారంభించారు. దశాబ్దాలుగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వాసులు నీటికోసం ఎన్నో కష్టాలు పడ్డారు. అనేక ఉద్యమాలు, నిరసనల ఫలితంగా తొలుత జూరాలకు అనుబంధంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల కట్టాలని ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వాలు భావించాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఇక్కడ సరిపడా నీటి లభ్యత లేదనే ఉద్దేశంతో ప్రాజెక్టును శ్రీశైలం వెనక జలాలకు తరలించింది. సుమారు 50కు పైగా టీఎంసీల నీళ్లను వినియోగించుకునేలా వివిధ దశల్లో ఎత్తిపోతలు, రిజర్వాయర్లతో పనులు చేపట్టారు. బీఆర్ఎస్ హయాంలో సింహభాగం పనులు పూర్తైనా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ దీన్ని పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తోంది.

## ఐరాస పక్షపాత ధోరణి అవలంబిస్తోంది

మొదటిపేజీ తరువాయి..

కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. సోమవారం నాడు ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం (ఖచీ౹ూా) మూడో కమిటీ 81వ సమావేశంలో 'మానవ హక్కుల మండలి నివేదిక' అనే అంశంపై ఇండియా తరపున భారత శాశ్వత మిషన్ ప్రథమ కార్యదర్శి అనూజ్ స్వరూప్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. మానవ హక్కుల పట్ల భారతదేశ వైఖరి బహుళత్వం, శాంతియుత సహజీవనం అనే దాని నాగరిక స్ఫూర్తిలో పాతుకుపోయిందని స్వరూప్ అన్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (మానవ హక్కుల మండలి) సభ్యురాలిగా భారత్ ఎల్లప్పుడూ చర్చలు, సహకార స్ఫూర్తితో నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తుందని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, ప్రతి పౌరుడికి గౌరవాన్ని అందించేందుకు కట్టుబడి ఉందని వెల్లడించారు. భారత్‌లో గత దశాబ్ద కాలంలో 25కోట్ల మందికి పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని స్పష్టం చేశారు. దేశ సామాజిక భద్రతా వ్యవస్థ వంద కోట్ల మందికి పైగా ప్రజలకు చేరిందని తెలిపారు. ఇందులో భాగంగా 8 కోట్ల మంది పౌరులకు ఉచిత ఆహార ధాన్యాలు, 6 కోట్ల మంది పౌరులకు ఉచిత ఆరోగ్య బీమా, మహిళల కోసం 32 కోట్ల బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయించడం వంటివి ఉన్నాయన్నారు. ఇవి భారతదేశ ప్రజల కేంద్రీకృత అభివృద్ధి నమూనాకు నిదర్శనమని నొక్కి చెప్పారు. అందరి మానవ హక్కుల పరిరక్షణకు, ప్రోత్సాహానికి భారత్ కట్టుబడి ఉందన్నారు. ఐరాస భద్రతా మండలిని సమర్థవంతమైన, నిష్పాక్షికమైన, విశ్వసనీయమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు సభ్యులందరితో కలిసి భారత్ పనిచేస్తుందని వివరించారు.

అలాగే ఆదివాసీల భూములు, భూభాగాలు, సరిహద్దుల నిర్ధరణ, నమోదు, యాజమాన్య హక్కుల కల్పనపై ఐక్యరాజ్యసమితి ఓ నివేదిక విడుదల చేసింది. అందులో ఇండియా పేరును ప్రస్తావించింది. దీన్ని స్వరూప్ తీవ్రంగా వ్యతిరేకించారు. అటవీ హక్కుల చట్టం కింద లక్షలాది క్లెయిమ్‌లు దాఖలు చేసినప్పటికీ, అవి పరిష్కారం కాకుండా మిగిలిపోయాయని నివేదికలో చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. అటవీ హక్కుల చట్టం కింద గణనీయమైన సంఖ్యలో క్లెయిమ్‌లు పరిష్కారం కాకుండా మిగిలిపోయాయన్న వాదన ఒక వ్యక్తి సమర్పించిన ఒకే ఒక్క సమాచారంపై ఆధారపడి ఉందని మండిపడ్డారు. ధ్రువీకరించని సమాచారంపై ఆధారపడి ఈ నివేదికను రూపొందించారని మండిపడ్డారు. దీంతో ఈ నివేదిక నిష్పాక్షికతను ప్రశ్నించాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు. "అటవీ హక్కుల చట్టం కింద భారత్‌లో 54 లక్షలకు పైగా క్లెయిమ్‌లు దాఖలయ్యాయి. వాటిలో 80 శాతానికి పైగా పరిష్కారమయ్యాయి. 25 లక్షలకు పైగా టైటిళ్లు పంపిణీ చేశాం. ధ్రువీకరించని సమర్పణల ఆధారంగా ఏర్పడిన ఇటువంటి వ్యత్యాసాలను సరిదిద్దేందుకు ప్రత్యేక ప్రతినిధికి నవీకరించిన డేటాను అందించడానికి భారత్ ముందుకొచ్చింది. ఏ వర్గాన్నీ వెనుకబడకుండా చూసే సుస్థిర, సంపూర్ణ అభివృద్ధికి భారత్ కట్టుబడి ఉంది. ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణకు, ప్రోత్సాహానికి భారత్ నిరంతరం మద్దతు ఇస్తోంది" అని స్వరూప్ చెప్పారు.

## చెరకు రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు

మొదటిపేజీ తరువాయి..

కమిటీకి అధ్యక్షత వహించనున్నారు. ఈ విషయాన్ని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ద్వారా వెల్లడించింది. కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన చెరకు రైతుల ప్రతినిధులు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి, కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రితో సమావేశమైన అనంతరం ఈ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. చెరకు సాగు ఖర్చులు, ఇతర సంబంధిత అంశాలను పరిగణనలోకి తీసుకుని రైతులకు మరింత మెరుగైన ప్రతిఫలం అందించాలన్న డిమాండ్‌ను కమిటీ పరిశీలించనుంది. అలాగే చక్కెర ఉత్పత్తి వ్యయం, మార్కెట్‌లో లభిస్తున్న ధరలు, చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎక్స్-మిల్ కనీస విక్రయ ధర సవరణ అవసరాన్ని కూడా అధ్యయనం చేయనుంది. చక్కెర రికవరీ శాతాన్ని పరీక్షించే, నమోదు చేసే ప్రస్తుత విధానాలను కమిటీ సమీక్షించనుంది. రికవరీ వివరాల నిర్ధారణలో పారదర్శకతను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిఫార్సులు చేయనుంది. చక్కెర మిల్లుల్లో చెరకు తూకం వేసే విధానాలు, తూకపు యంత్రాల క్రమబద్ధీకరణ, తనిఖీలు, ధ్రువీకరణ వ్యవస్థలు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయన్న అంశాలను కూడా పరిశీలించనుంది. యంత్రాల ద్వారా కోత కోసిన చెరకులో బరువు తగ్గింపునకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయడంతో పాటు, యాంత్రిక కోత కారణంగా వాస్తవంగా ఎంత నష్టం జరుగుతోంది? ఆ నష్టం రైతులకు చెల్లించే చెరకు ధరపై ఎలాంటి ప్రభావం చూపుతోంది? అనే అంశాలను విశ్లేషించనుంది. అవసరమైతే ఇతర సంబంధిత అంశాలనూ పరిశీలించనుంది. ఈ కమిటీ రైతు సంఘాల ప్రతినిధులు, చక్కెర మిల్లుల సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, నిపుణులు, ఇతర సంబంధిత సంస్థలతో సంప్రదింపులు జరపనుంది. తన పరిశీలనలతో పాటు నిర్దిష్ట సిఫార్సులతో కూడిన నివేదికను వీలైనంత త్వరగా సమర్పించనుంది. అనంతరం సంబంధిత అధికారం ఆ నివేదికను పరిశీలించనుంది. ప్రొఫెసర్ రమేశ్ చంద్ర వ్యవసాయ ఆర్థిక శాస్త్రం, ప్రజా విధానాల నిపుణుడు. ఆయన 2015 నుంచి 2026 వరకు నీతి ఆయోగ్ సభ్యుడిగా పనిచేశారు. గతంలో -నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎకనామిక్స్ అండ్ పాలసీ డైరెక్టర్‌గా, 15వ ఆర్థిక సంఘం సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ కమిటీలో వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ వ్యవసాయ కమిషనర్, ఆహార, ప్రజా పంపిణీ శాఖ జాయింట్ సెక్రటరీ (షుగర్), వినియోగదారుల వ్యవహారాల శాఖ జాయింట్ సెక్రటరీ (లీగల్ మెట్రాలజీ) సభ్యులుగా ఉన్నారు. చెరకు సాగు ఖర్చులు, రైతులకు లభించే ధర, చక్కెర రికవరీ, తూకాల్లో పారదర్శకత వంటి కీలక అంశాలపై ఈ కమిటీ చేసే సిఫార్సులు చెరకు రైతుల సమస్యల పరిష్కారంలో ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి.

# తెచ్చేది మేమే ఇచ్చేది మేమే

- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి ధన్యవాదాలు
- మా మండలానికి గ్రూపూ స్కూల్ రాకుండా అడ్డుకున్నోళ్లకి పాలాభిషేకాలంటూ కాంగ్రెస్ శ్రేణుల మండిపాటు
- రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన సోనాల మండల కాంగ్రెస్ శ్రేణులు



**సికె.న్యూస్.బోథ్** సోనాల మండల కేంద్రానికి టీపీఎస్ స్కూల్ మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సోనాల మండలానికి నాడు టీపీఎస్ స్కూల్ రాకుండా అడ్డుకున్నోళ్లు నేడు మా వల్లే వచ్చిందని ప్రగల్భాలు పలుకుతున్నారని కాంగ్రెస్ శ్రేణులు ఎద్దేవా చేశారు . టీపీఎస్ స్కూల్ రావడానికి ముఖ్య కారణం మాజీ ఎంపీ మా మండల వాసి సోయం బాపురావు గారు .మరియు వారితో పాటు డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్,బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్,తుల అరుణ్ ,జిల్లా పి ఏ సి సభ్యులు ఏలేటి అశ్విన్ రెడ్డి గారు మరియు నాయకులు అందరి కృషితో నేడు సాధ్యమైనదని అన్నారు కానీ కొందరు నాయకులు టీపీఎస్ స్కూల్ ఏర్పాటు చేయాలని ఒకరోజు కూడా ఒక ప్రకటన ఇవ్వకుండా కొందరితో తీర్మానాలు సేకరించి అడ్డుకునే ప్రయత్నం చేశారని కాంగ్రెస్ శ్రేణులు మండిపడ్డారు గత 10 సంవత్సరాలలో సోనాల మండల కేంద్రం లో ఒక్క ఇల్లు అయినా ఇచ్చారా అని ప్రశించారు,ఇప్పుడు ఇందిరమ్మ ఇల్లు ఇస్తే ఆడలేక మద్దెల ఓడినట్టు మేమే ఇస్తున్నామని అవగాహన రాహిత్య ఆరోపణలు చేస్తున్నారు అని మండిపడ్డారు .10సంవత్సరాలలో వృద్దులు,మహిళలు,విద్యార్థులు ఎంతో ఇబ్బంది పడ్డా కూడా కాంగ్రెస్ శ్రేణులు ధర్నాలు చేసిన కూడా రోడ్డు వేయలేని పరిస్థితి,కానీ ప్రజా ప్రభుత్వం రాగానే దాదాపు కోటి రూపాయలు మంజూరు చేసి సోనాల ప్రజల రవాణాను బంగారు బాట గా మార్చి రోడ్డు వేయించింది ,కానీ దానికి కూడా మేమే చేశామనడం హాస్యాస్పదం అన్నారు.ఆవగింజ అంత రాజకీయ అవగాహన ఉన్న వాళ్ళకి కూడా తెలుసు ఎవరు అధికారం లో ఉన్నారు ఎవరు ఇస్తున్నారు,ఎవరు చేస్తున్నారు అని ఇప్పటికైనా కళ్ళు తెరిచి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని కొనియాడాలని అభివృద్ధికి సహకరించాలని తెలియచేసారు . ఈ కార్యక్రమం లో సోనాల సర్పంచుల సంఘం అధ్యక్షులు వినోద్ చౌహాన్,బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్,డీసీసీ కార్యదర్శులు లోలపు పోశెట్టి,హరిసింగ్,ఘనపూర్ సర్పంచ్ రమాదేవి,చింతల్బోరి సర్పంచ్,శ్రీరామ్,వజ్జర్ సర్పంచ్ లక్ష్మణ్,కోట కె సర్పంచ్ పూజ సంగ్రామ్,మైనారిటీ మండల అధ్యక్షులు ఇబ్రహీం,మార్కెట్ డైరెక్టర్ లు జంగాల బోజన్న,మునీశ్వర్ సోమన్న,మండల ప్రధాన కార్యదర్శి బశెట్టి సుదర్శన్,ఆత్మ డైరెక్టర్ శ్రీధర్ పటేల్,మాజీ సర్పంచ్ బాపురావు,వార్డ్ మెంబెర్ చెట్లపల్లి అశోక్, సీనియర్ నాయకులు బండు పటేల్,మాధవరావు పటేల్,జాకేష్,లాలూరాం,పరుశురాం,రాజారాం మరియు తదితరులు ఉన్నారు.

## మా తండ్రి కొన్న ఇంటి భూమిని గంకిడి శ్రీనివాస్ రెడ్డి నుండి మాకు ఇప్పించండి, ముక్కరా ఘవులు, రమేష్, శ్రీనివాస్,

**సీకే న్యూస్ అక్టోబర్ 14 బుధవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:**ధర్మసాగర్ గ్రామానికి చెందిన మొక్క దామోదర్ కు మేము ముగ్గురం అన్నదమ్ములం ముక్క రాఘవులు , రమేష్ శ్రీనివాస్ మా తండ్రి 30 సంవత్సరంలో వ్యవసాయం చేసి వచ్చిన డబ్బులతో గంకిడి శ్రీనివాస్ రెడ్డి ఇంటి ప్రక్కన రోడ్డుకు ఆనుకొని ఉన్న భూమిని నాలుగు గుంటలు బండ ఇంద్ర రెడ్డి వద్ద కొన్నాము.ఆ భూమి మా పేరు మీద రిజిస్ట్రేషన్ అయినది 10 69
ఈ సర్వేలో కూడా 141 గజం తీసుకున్నాము దామోదర్ రెడ్డి మాకు అమ్మడం జరిగినది.ఈ రెండు భూమి కాగితాలు,లింకులు, డాక్యుమెంట్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ ,వర్జినల్స్ మా వద్ద ఉన్నా కూడా మా ఇంటి భూమిని కబ్జా చేయాలన్న ఉద్దేశంతో గంకిడి శ్రీనివాస్ రెడ్డి మమ్మల్ని ఇబ్బంది పెడుతూ ఉన్నాడు.మా భూమిలో మేము ప్రొద్దున బేస్ మీట్ కట్టుకొని ఉంటే, రాత్రి సమయంలో మేము లేనిది చూసి కూలగొట్టడం చేస్తూ, మమ్మల్ని బెదిరిస్తూ ఉన్నారు.శ్రీనివాస్ రెడ్డి మీరు చేసేది తప్పు అని మేము అతని అడగగా మమ్మల్ని బూతులు తిడుతూ, భయభ్రాంతులకు గురి చేస్తూ, మిమ్మల్ని లారీలతో గుద్ది సంపుతామని బెదిరిస్తున్నారు. మా భూమిలోనే తను ఇప్పటికీ ఇసుక నిల్వలు చేసి, లారీలు పెడుతూ చలామణి చేస్తున్నారు, అతన్ని బాధలను తట్టుకోలేక ఈరోజు మేము అన్నదమ్ములం కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మా గోడునంత విన్నవిస్తూ ఉన్నాశీ.అధికారులు అందరూ కలిసి మా మీద దయ తలచి మా కుటుంబానికి న్యాయం చేయమని అడుగుతున్నాం.

# అన్నపూర్ణాదేవిగా కన్యకా పరమేశ్వరి.



**అనకాపల్లి, సీకే న్యూస్ అక్టోబర్ 14:** పట్టణంలో ప్రసిద్ధి చెందిన వాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రి మహోత్సవం బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు, ఆలయ మండపంలో బేడసేవ, శ్రీ చక్ర అభిషేకాలు, నక్షత్ర హారతి, గోపూజ నిర్వహించారు. శ్రీహరి భజన మండలి వారిచే కోలాట నృత్య ప్రదర్శన చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి శ్రీధరాల సోమరాజు, కోశాధికారి కడిమిశెట్టి అచ్యుత రామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వివిఎస్ మాణిక్యం, భక్తులు తదిరులు పాల్గొన్నారు.

# విలేజ్ పోలీస్ ఆఫీసర్ విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలి

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్.
- మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలి.
- గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి.
- ప్రతి ఒక్క సిబ్బంది విధులను నీతి, నిజాయితీ లతో నిర్వర్తించాలి.
- బ్లూ కోర్టు, డయల్ 100 సిబ్బంది మండల పరిధిలోని ప్రతి ఒక్క గ్రామాన్ని సందర్శించాలి
- తలమడుగు పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా పరిశీలన



**సికె.న్యూస్.అదిలాబాద్ :** తలమడుగు పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ఆకస్మికంగా పరిశీలించారు మొదటగా పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాలను పరిశీలించి ఎస్సై డి రాధిక కు పలు సూచనలు చేశారు. అదేవిధంగా సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బంది ప్రతిరోజూ నిర్వర్తిస్తున్న విధులను పరిశీలించారు. ప్రతి ఒక్క సిబ్బందికి గ్రామాలను కేటాయించి విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను మరింత పటిష్టంగా నిర్వహించాలి. గ్రామాల లో జరుగుతున్న ప్రతి ఒక్క సమాచారం తెలుసుకునే విధంగా సమాచార వ్యవస్థను పెంపొందించుకోవాలి. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలి. గ్రామాలలో విపిఓ పాత్ర కీలకంగా వ్యవహరించబడుతుందని, ప్రతి ఒక్కరు ప్రజలతో మంచి సత్సంబంధాలను ఏర్పరచుకోవాలని సూచించారు. అదేవిధంగా మండల పరిధిలో ఎలాంటి బెదిరింపులకు, దౌర్జన్యానికి ఆస్కారం లేకుండా రౌడీ షీట్లను ప్రతి నెల తనిఖీ చేస్తూ ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ నందు రిసెప్షన్ పాత్ర కీలకంగా వ్యవహరిస్తుందని, పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుల పట్ల సక్రమంగా వ్యవహరిస్తూ బాధితులకు సత్వర న్యాయం చేసే విధంగా సిబ్బందిని కేటాయించి పరిష్కరించాలని సూచించారు. ప్రతిరోజు ప్రమాదాల నివారణకు సాయంత్రం సమయాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ ప్రమాదాలను అరికట్టాలని తెలిపారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలలో గంజాయి పండించడం వ్యాపారం, చేయడం, సేవించడం, లాంటివి జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గంజాయి పై సమాచారం అందించిన సిబ్బందికి ప్రజలకు నగదు రీవార్డులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. స్టేషన్లో ఉన్న రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా ఉండాలని సూచించారు. రికార్డుల ను పూర్తిచేసే కోర్టు నందు చార్జిషీట్ దాఖలు చేసి బాధితులకు న్యాయం చేయ విధంగా చూడాలన్నారు. ఈ ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, ఎస్ఐ డి రాధిక, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**నిర్వాహకులను అభినందించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, అక్టోబర్ 13(సీ కే న్యూస్):** జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సంగారెడ్డిలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్, టీయూడబ్ల్యూజే-ఐజేయూ సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో, సన్‌రైజ్ ఆసుపత్రి, రథసారథి తెలుగు దినపత్రిక సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ నిర్వాహకులను అభినందించారు.
నిత్యం పని ఒత్తిడితో విధులు నిర్వహించే జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ సభ్యుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.
జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం
టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ మాట్లాడుతూ, రాష్ట్ర యూనియన్ గతంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించిందని తెలిపారు. అదే స్ఫూర్తితో సంగారెడ్డి జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమానికి సహకరించిన సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు.
టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ, రాష్ట్ర నాయకత్వం స్ఫూర్తితో జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ చొరవతో నిర్వహించిన ఈ శిబిరానికి సన్‌రైజ్ ఆసుపత్రి, రథసారథి పత్రిక అందించిన సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో జర్నలిస్టులు అనేక ఒత్తిళ్ల మధ్య విధులు నిర్వహిస్తున్నందున క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.
స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ సిద్దిఖ్ మాట్లాడుతూ, జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా పాల్గొని ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమన్నారు.
వివిధ విభాగాల్లో వైద్య పరీక్షలు
జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిర్వహించిన ఈ శిబిరంలో సన్‌రైజ్ ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారని తెలిపారు. గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం, ఎముకలు, మెదడు, నరాల సంబంధిత వ్యాధులతో పాటు చిన్నపిల్లలు, మహిళలు, సాధారణ వైద్య విభాగాలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలు అందించినట్లు వివరించారు. వివిధ రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు అందుబాటులో ఉన్న మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారని తెలిపారు.
జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న, పెద్ద దినపత్రికలు, కేబుల్ మీడియా, సామాజిక మాధ్యమాలకు చెందిన జర్నలిస్టులు తమ కుటుంబ సభ్యులతో కలిసి శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.
పలువురు ప్రముఖుల హాజరు
ఈ కార్యక్రమంలో డీపీఆర్వో విజయలక్ష్మి, అడిషనల్ డీపీఆర్వో ఏడుకొండలు, టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు జావిద్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఇతర నాయకులు కసిని శ్రీకాంత్, వెంకట్ రెడ్డి, యాదవ రెడ్డి పాల్గొని నిర్వాహకులను అభినందించారు.
సన్‌రైజ్ ఆసుపత్రి అధినేత స్వామి గౌడ్, రథసారథి ఎండీ సంతోష్ గౌడ్, సాక్షి సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ బాల ప్రసాద్, ఆంధ్రప్రభ సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ రాజు, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు ప్రభాకర్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు మతీన్, మల్లేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, కోశాధికారి సిద్ధూ జైన్, స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు నజీర్‌తో పాటు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు హిమాయత్, ఇర్ఫాన్, రాజేశ్వర్, దినేష్ నాయక్, శ్రీకాంత్, మహేష్ గౌడ్, కొండాపూర్ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**జన న్యూస్ ప్రతినిధి:** బొర్రా రాజు. శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ “ది జాయింట్ అల్ మంది రెస్టారెంట్ “లో మటన్ మంది తింటుండగా వచ్చిన మనిషి యొక్క పుచ్చిపోయిన పన్ను. ఇదేంటని యాజమాన్యాన్ని ప్రశ్నించినందుకు ఏం చేసుకుంటావో చేసుకో ఎక్కడైనా ఫిర్యాదు చేసుకో అని బెదిరింపులకు దిగిన యాజమాన్యం. ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా ఏదో ఒకటి మాట్లాడుకుని సెటిల్మెంట్ చేసుకోవాలని సూచించిన ఫుడ్ ఇన్స్పెక్టర్ నిహారిక. గంటలు దాటుతున్న ఇంకా రాని అధికారులు. హోటల్ యజమాని చిరంతన్ రెడ్డి అతని సిబ్బంది. తనకి అధికారులు అండదండలు ఉన్నాయి అని చెపుతూ ఫోన్లు చేసి బెదిరింపులు



# చిన్నారికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి అభినందనలు



**పటాన్చెరు, అక్టోబర్ 13(సీ కే న్యూస్):**ప్రస్తుత కాలంలో విద్యతో పాటు క్రీడలలో రాణించడం ఎంతో కీలకమని, ముఖ్యంగా యోగా సాధన ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత లభిస్తాయని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు.సంగారెడ్డి పట్టణంకు చెందిన చిన్నారి వాసవి నిద్రాభంగి జాతీయ స్థాయిలో అసాధారణ ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తిని దేశవ్యాప్తంగా చాటారు. రాజస్థాన్‌లోని చారిత్రాత్మక జైపూర్ నగరంలో గల అలంకార్ మహిళా పీజీ మహావిద్యాలయంలో అక్టోబర్ 3 నుండి 6వ తేదీ వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 51వ సబ్-జూనియర్ ూ జూనియర్ నేషనల్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్-2026 పోటీల్లో ఆమె పాల్గొని అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయ స్థాయి క్రీడా సంబరాలలో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించిన వాసవి నిద్రాభంగి, సబ్-జూనియర్ గ్రూప్-ూ (8-10 సంవత్సరాల బాలికల విభాగం) యోగాసన పోటీల్లో అత్యంత క్లిష్టమైన ఆసనాలను అవలీలగా ప్రదర్శించి జాతీయ స్థాయిలో ఐదవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పలు రాష్ట్రాల నుండి వచ్చిన ఉద్ధండులైన క్రీడాకారులతో పోటీపడి, చిన్న వయసులోనే పతకం సాధించడం పట్ల సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు చిన్నారి సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలోని ఎమ్మెల్సీ నివాసంలో వారు కలిశారు. ఈ మేరకు శాలువా కప్పి, ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంలో తల్లిదండ్రుల పాత్ర అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, తదితరులు పాల్గొన్నారు.

# కార్యాలయ శ్రేష్ఠతపై గీతంలో యాజమాన్య వికాస కార్యక్రమం

- హెటెరో సహకారంతో రెండు రోజుల శిక్షణా కార్యక్రమం
- వివిధ పరిశ్రమలకు చెందిన 30 మంది నిపుణుల హాజరు



**సంగారెడ్డి, అక్టోబర్ 13(సీ కే న్యూస్ ):** కార్యాలయాల్లో సమర్థవంతమైన భావవ్యక్తీకరణ, పరస్పర సహకారం, నిబద్ధతతో కూడిన పనితీరును పెంపొందించే లక్ష్యంతో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, ప్రముఖ ఔషధ సంస్థ హెటెరో సహకారంతో రెండు రోజుల యాజమాన్య వికాస కార్యక్రమాన్ని (ఎండీపీ) ప్రారంభించింది. 'భావ వ్యక్తీకరణ, సహకారం, నిబద్ధత కార్యాలయంలో అత్యుత్తమ పనితీరు కోసం మూడు సీ'ల ప్రయోజనం' అనే అంశంపై బుధవారం జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమాన్ని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా, హెటెరో అభ్యసన, అభివృద్ధి విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసన్, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కున్మన్ మిశ్రా, సంస్థాగత అభివృద్ధి, మానవ వనరుల నిర్వహణ విభాగం చైర్ డాక్టర్ కె.ఎన్. రేఖలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ దివ్య కీర్తి గుప్తా మాట్లాడుతూ, గీతం విశ్వవిద్యాలయంలో అందిస్తున్న కోర్సులు, ఆధునిక మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, బహుళ విషయ విధానం, ఉదార విద్యా విధానం, ఉత్సాహభరితమైన విద్యా వాతావరణం గురించి వివరించారు. వివిధ రంగాలకు చెందిన నిపుణులు తమ అనుభవాలను పంచుకుంటూ, చర్చల్లో చురుగ్గా పాల్గొని, ఈ కార్యక్రమం ద్వారా గరిష్ఠ ప్రయోజనం పొందాలని సూచించారు.

నేటి వేగంగా మారుతున్న కార్యక్షేత్రంలో నిరంతర అభ్యాసం, వృత్తిపరమైన నైపుణ్యాల అభివృద్ధి ఎంతో అవసరమని డాక్టర్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. గీతం వంటి విద్యా సంస్థల్లో నిర్వహించే శిక్షణా కార్యక్రమాలు నిపుణులు తమ జ్ఞానాన్ని నవీకరించుకోవడానికి, నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి, కొత్త ఆలోచనా విధానాలను అలవర్చుకోవడానికి దోహదపడతాయని అన్నారు. ఉద్యోగుల అభివృద్ధికి హెటెరో సంస్థ కట్టుబడి ఉందని, అభ్యాసం, శిక్షణా కార్యక్రమాల్లో నిరంతరం పెట్టుబడులు పెడుతోందని తెలిపారు. పాల్గొనే ప్రతినిధులు ప్రశ్నలు అడుగుతూ, తమ అభిప్రాయాలను పంచుకుంటూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

డాక్టర్ కె.ఎన్. రేఖ రెండు రోజుల కార్యక్రమ ప్రణాళికను వివరించారు. కార్యాలయంలో నిష్కాపట్యం, బృంద స్ఫూర్తి, పరస్పర సహకారం, సమష్టి అభ్యాసం ప్రాధాన్యతను తెలియజేశారు. చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం, నేర్చుకున్న అంశాలను కార్యక్షేత్రంలో అమలు చేయడం లక్ష్యంగా గ్రూప్ అసైన్‌మెంట్లను రూపొందించినట్లు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా తొలిరోజు డాక్టర్ రేఖ, డాక్టర్ హనీ కనోజియాల ఆధ్వర్యంలో కమ్యూనికేషన్, సహకారంపై ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించారు. అనంతరం డాక్టర్ కున్మన్ మిశ్రా, డాక్టర్ రేఖల నేతృత్వంలో కార్యాలయ ప్రవర్తనలు, లెర్నింగ్ లాగ్, కీలక అంశాలపై సెషన్లు జరిగాయి. బృందంగా పనిచేయడం, పరస్పరం నేర్చుకోవడం వంటి నైపుణ్యాలను పెంపొందించే గ్రూప్ అసైన్‌మెంట్‌తో తొలిరోజు కార్యక్రమాలు ముగిశాయి.

గురువారం జరిగే రెండో రోజు కార్యక్రమంలో సమయ నిర్వహణ, ప్రాధాన్యతల నిర్ణయం, యాజమాన్య దృక్పథం, జవాబుదారీతనం వంటి కీలక వృత్తిపరమైన అంశాలపై శిక్షణ అందించనున్నారు. నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టి కార్యాలయ పనితీరును మెరుగుపరచుకునేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో వివిధ పరిశ్రమలకు చెందిన సుమారు 30 మంది నిపుణులు పాల్గొంటున్నారు. సమర్థవంతమైన భావప్రసారం, పరస్పర సహకారం, బాధ్యతాయుతమైన పని సంస్కృతిని పెంపొందించడంతో పాటు నిరంతర వృత్తిపరమైన అభివృద్ధిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# ప్రతి కుటుంబంలోని తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేయకూడదు

- నేరెళ్ల వెంకట హైమ పూజిత జిల్లా కోర్టు జడ్జి, సెక్రటరీ




**సీకే న్యూస్ అక్టోబర్ 14 బుధవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:** వివాహ బలిపీఠంపై బాల్యం ఆగం కావొద్దు నేరెళ్ల వెంకట హైమ పూజిత గ్రామంలోని ప్రజలకు తెలియపరుస్తూ వివాహ బలిపీఠంపై బాల్యం ఆగం కావొద్దని అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణంలో సర్పంచి మాచర్ల జ్యోతి ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.నేడు ఒకవైపు డిజిటల్ విప్లవం,ఆధునిక సాంకేతికతతో సమాజం వేగంగా ముందుకు సాగుతున్నప్పటికీ, మన చుట్టూ ఇంకా బాల్య వివాహాలనే సామాజిక జాడ్యం మిగిలే ఉండటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు.ఆడపిల్లల చదువుకు,వారి భవిష్యత్తుకు నూరేళ్ల పందిరి వేయాల్సిన వయసులో పచ్చని కాపురాల పేరిట వారి చిన్నారి కలలను చిదిమేస్తున్నారని ఆరోపించారు.ఈ సామాజిక విపత్తును అరికట్టడానికి న్యాయసేవా సంస్థ ముందుండి పోరాడుతోందని తెలిపారు.బాల్య వివాహం చట్టరీత్యా తీవ్రమైన నేరం,భారత చట్టాల ప్రకారం ఆడపిల్లలకు 18 సంవత్సరాలు, మగపిల్లలకు 21 సంవత్సరాలు పూర్తయ్యాకే వివాహం జరిపించాలన్నారు. బాల్య వివాహ నిషేధ చట్టం – 2006 పి సి ఎం ఏ ప్రకారం 18 ఏళ్లలోపు పిల్లలకు పెళ్లి చేయడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమన్నారు.ఈ వివాహాలు జరిపించినా,ప్రోత్సహించినా లేదా హాజరైనా సరే 2 సంవత్సరాల వరకు కఠిన జైలు శిక్ష, రూ. 1 లక్ష వరకు జరిమానా విధించే నిబంధన ఉందని వివరించారు.న్యాయసేవా సంస్థ చేపడుతున్న కీలక చర్యలు పాఠశాలలు, గ్రామాలు,అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్యపరమైన, మానసికమైన తీవ్ర నష్టాలను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. అత్యవసరమైతే చైల్డ్ హెల్ప్‌లైన్1098,నేషనల్ ఎమర్జెన్సీ నంబర్ 112,న్యాయసేవా సంస్థ ఉచిత హెల్ప్‌లైన్ 15100,షీ టీమ్స్ / ఉమెన్ హెల్ప్‌లైన్ 181 / 100 నెంబర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో ప్రవీణ్ కుమార్, అడ్వకేట్ కవిత, తహసిల్దార్ బహుసింగ్,ఎంపీఓ అఫ్జల్,సీఐ అనుముల శ్రీనివాస్,ఉప సర్పంచ్ కొంతం కొమరమ్మ, అంగన్వాడి ఆశా కార్యకర్తలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రీసర్వే పనులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం గడువులోగా పూర్తి చేయాలి...

## అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

- సర్వే నిర్వహించే తేదీ, సమయాన్ని రైతులకు ముందుగానే తెలియజేయాలి
- రీసర్వే సమయంలో రైతులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలి



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** లచ్చగూడెం రెవెన్యూ గ్రామంలో రీసర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్‌లి జిల్లాలో చేపడుతున్న రీసర్వే పనులను ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశిత నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు.

బుధవారం ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలం లచ్చగూడెం రెవెన్యూ గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే పనులను అదనపు కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

రీసర్వే ప్రక్రియ పురోగతిని సమీక్షించి, సర్వే పనులు సక్రమంగా నిర్వహించేలా సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రీసర్వే పనులను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియలో సంబంధిత భూముల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ, రికార్డుల ప్రకారం సర్వే పనులు చేపట్టాలని తెలిపారు.

రీసర్వే నిర్వహించే తేదీ, సమయం గురించి సంబంధిత రైతులకు ముందుగానే సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండేలా చూడాలని, తద్వారా భూముల హద్దులు, ఇతర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.

రైతులకు ముందస్తు సమాచారం అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని, సర్వే ప్రక్రియలో రైతుల భాగస్వామ్యాన్ని నిర్ధారించాలని సూచించారు. రీసర్వేకు సంబంధించిన పనులను సమన్వయంతో నిర్వహిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు.

రీసర్వే ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత కాలపరిమితిలో సర్వే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ వెంట చింతకాని మండల తహసీల్దార్ కరుణశ్రీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్
- డిజిటల్ అరెస్ట్, లోన్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్ పేరుతో జరిగే మోసాల పట్ల జాగ్రత్త
- సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలి
- ఉచిత పోలీసు శిక్షణ పొందుతున్న 350 మంది అభ్యర్థులకు సైబర్ నేరాలపై అవగాహన
- జాతీయ సైబర్ జాగృతి మాసోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం.
- కష్టపడి చదివి కానిస్టేబుల్, ఎస్సై ప్రాథమిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలి

**సికె.న్యూస్ ప్రతినిధి..ఆదిలాబాద్** జాతీయ సైబర్ జాగృతి మాసోత్సవంలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో పోలీసు కానిస్టేబుల్, ఎస్సై అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఉచిత ప్రాథమిక పరీక్ష శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ పాల్గొని, సుమారు 350 మంది విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను వివిధ రకాలుగా మోసం చేస్తున్నారని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

### లోన్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్ పట్ల జాగ్రత్త

తక్కువ వడ్డీకే రుణాలు ఇప్పిస్తామని చెప్పి ముందుగా ప్రాసెసింగ్ ఫీజులు, ఇతర ఛార్జీల పేరుతో డబ్బులు వసూలు చేసే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసే వ్యక్తులను నమ్మవద్దని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ, ఏటీఎం పిన్ వంటి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని స్పష్టం చేశారు.

### కస్టమర్ కేర్ పేరుతో మోసాలు.. అప్రమత్తతే రక్షణ

కస్టమర్ కేర్ నంబర్ల కోసం ఇంటర్నెట్‌లో వెతికేటప్పుడు అధికారిక వెబ్‌సైట్లలో ఉన్న నంబర్లనే వినియోగించాలని సూచించారు. నకిలీ కస్టమర్ కేర్ నంబర్ల ద్వారా సంప్రదించే సైబర్ నేరగాళ్లు సమస్య పరిష్కరిస్తామని నమ్మించి బ్యాంకు వివరాలు, ఓటీపీలు తీసుకొని ఖాతాల్లోని డబ్బును కాజేస్తున్నారని వివరించారు. అపరిచితులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, తెలియని యాప్‌లను ఇన్‌స్టాల్ చేయవద్దని సూచించారు.

### డిజిటల్ అరెస్ట్ పేరుతో భయపెట్టి డబ్బులు వసూలు

పోలీసులు, సీబీఐ, కస్టమ్స్ లేదా ఇతర ప్రభుత్వ అధికారులమని ఫోన్ చేసి, మీపై కేసులు నమోదయ్యాయని లేదా మీ పేరుతో అక్రమ లావాదేవీలు జరిగాయని భయపెట్టి వీడియో కాల్స్ ద్వారా డబ్బులు డిమాండ్ చేసే మోసగాళ్ల పట్ల



జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో భయపెట్టి డబ్బులు వసూలు చేయడం సైబర్ మోసాల్లో ఒక ముఖ్యమైన విధానమని వివరించారు. ఇలాంటి కాల్స్ వచ్చినప్పుడు భయపడకుండా, ఆ వ్యక్తులు చెప్పినట్లు డబ్బులు బదిలీ చేయకుండా సంబంధిత పోలీసులను సంప్రదించాలని సూచించారు.

### సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి

సైబర్ నేరానికి గురైనప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. అలాగే షషష.ఎఎఎవతీఎతీఱఎవ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మోసానికి సంబంధించిన ఫోన్ నంబర్లు, మెసేజ్‌లు, లావాదేవీల వివరాలు, స్క్రీన్‌షాట్‌లు వంటి ఆధారాలను భద్రపరచుకోవాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా డబ్బును నిలిపివేసే లేదా తిరిగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.

### కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలి

ఉచిత పోలీసు శిక్షణ పొందుతున్న అభ్యర్థులను ఉద్దేశించి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, కానిస్టేబుల్, ఎస్సై ప్రాథమిక పరీక్షల్లో ప్రతి ఒక్కరూ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించేలా క్రమశిక్షణతో చదవాలని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, రోజువారీ చదువుతో పాటు పునశ్చరణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నిరంతర కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని సాధించాలని అభ్యర్థులకు సూచించారు.

### పోలీసు ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి

పోలీసు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా ఎస్పీ సూచించారు. పోలీసు నియామకాలు పూర్తిగా నిబంధనల ప్రకారం, పారదర్శకంగా జరుగుతాయని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, మోసాలకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసినా వెంటనే పోలీసు యంత్రాంగానికి తెలియజేయాలని సూచించారు. ఇలాంటి నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్, రూరల్ ఎస్సై వి. విష్ణువర్ధన్, సైబర్ ఏఎస్ఐ సురేందర్, సిబ్బంది ఏసుదాస్, శివ, ఆహద్ తదితరులు పాల్గొన్నారు.

# పృథ్వి బిగ్ మార్ట్ ను ప్రారంభించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

## బాసు హనుమంతు నాయుడు

**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :** ఈరోజు గద్వాల పట్టణంలో బీరెల్లి చౌరస్తా సమీపంలో కొండపల్లి బలరాం నూతన పృథ్వి బిగ్ మార్ట్ ను బాసు హనుమంతు నాయుడు , రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి,షాప్ యజమానికి శుభాకాంక్షలు తెలిపారు.... అనంతరం,బాసు హనుమంతు నాయుడు ని షాప్ యజమాని పూల బొక్కే ఇచ్చి,శాలువాతో ఘనంగా సత్కరించారు....ఈ కార్యక్రమంలో అల్లపాడు ప్రతాప్,మోనేష్ మరోజు,శేఖర్ నాయుడు,కె.కె.తిరుమలేష్,తిమ్మప్ప, మహేష్, లక్ష్మణ,మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు....



# బీఎల్‌ఓలకు పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలి



**అక్టోబర్ (14) సి కె న్యూస్ అబ్దుల్లా ఉస్మాన్ నారాయణఖేడ్ జిల్లా సంగారెడ్డి.**

బతుకమ్మ పండుగ వేళ కూడా బీఎల్‌ఓలకు ఇబ్బందులా? అధికారుల తీరుపై చిరంజీవి ఆగ్రహం నారాయణఖేడ్: బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓలు) చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ డబ్బులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ కోఆర్డినేషన్ సెంటర్ (ఒఖజజ) నాయకుడు చిరంజీవి డిమాండ్ చేశారు.బీఎల్‌ఓలతో పని చేయించుకుంటూ వారికి చెల్లించాల్సిన డబ్బులను సకాలంలో చెల్లించకపోవడం వల్ల వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ సమయంలోనైనా ఆడపడుచులు సంతోషంగా పండుగ జరుపుకునే పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పని చేయించుకున్న తర్వాత పారితోషికాలు చెల్లించకుండా బీఎల్‌ఓలను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు.

బీఎల్‌ఓలు తమ విధులను నిర్వహిస్తున్నప్పటికీ, వారికి రావాల్సిన డబ్బుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడటం బాధాకరమన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి బీఎల్‌ఓలకు న్యాయం చేయాలి. లేనిపక్షంలో వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేపట్టాల్సి వస్తుందని చిరంజీవి హెచ్చరించారు.

ఇట్లు:
చిరంజీవి
సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ కోఆర్డినేషన్ సెంటర్ (ఒఖజజ)ద

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

## వాహనదారులు నిబంధనలు పాటించాలి: ట్రాఫిక్ ఎస్సై: సురేందర్



**వనపర్తి, జిల్లా ఎర్రమన్ను బాలరాజు, 14- (నగర నిజం):** వనపర్తి పట్టణంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఎస్సై సురేందర్ సూచించారు. దుర్గామాత ఉత్సవాలు, దసరా పండుగ సందర్భంగా పట్టణంలోని దుకాణాలు, వ్యాపార సముదాయాల వద్ద రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా దుకాణాలు, వ్యాపార సముదాయాల ముందు రహదారులపై వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేయకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగని విధంగా నిర్ణీత ప్రదేశాల్లోనే పార్కింగ్ చేయాలని సూచించారు. దుకాణాల యజమానులు, వ్యాపార సముదాయాల నిర్వాహకులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించినా, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినా ఎంతటి వారిపైనైనా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్సై సురేందర్ హెచ్చరించారు. పండుగల సమయంలో పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నాగులవంచ గడీ సెంటర్‌లో మహా అన్నదానం..

- భక్తి, సేవాభావానికి ప్రతీకగా నిలిచిన వేడుక!
- అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న చింతకాని ఎస్ఐ జి. నరేష్,
- ప్రజాప్రతినిధులు, భవానీ స్వాములు, ప్రెస్ క్లబ్ సభ్యులు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**నాగులవంచ గ్రామంలోని గడీ సెంటర్‌లో మహా అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తి భావంతో చేపట్టిన ఈ అన్నదాన కార్యక్రమంలో భవానీ స్వాములు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమానికి చింతకాని ఎస్ఐ జి. నరేష్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి అంబటి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. అదేవిధంగా చింతకాని మండల ప్రెస్ క్లబ్ సభ్యులు సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు . భవానీ స్వాములు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

అన్నదానం మహాదానం.. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మానవత్వానికి నిదర్శనం అనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పలువురు పేర్కొన్నారు. నాగులవంచ గడీ సెంటర్‌లో నిర్వహించిన ఈ మహా అన్నదాన కార్యక్రమం భక్తి, సేవ, మానవత్వం కలగలిసిన వేడుకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో... కాంగ్రెస్ మండల అధ్యక్షులు కన్నెబోయిన గోపి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొప్పుల గోవిందరావు. భవాని భక్తులు, భక్తులు,ప్రజలు, స్థానిక ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి దేవాలయ దసరా మహోత్సవాలు

పాల్గొన్న మాదిరి పృథ్వీరాజ్



**పటాన్చెరు, అక్టోబర్ 13(సీ కే న్యూస్):** పటాన్చెరు పట్టణంలోని మైత్రి గ్రౌండ్‌లో మహంకాళి దేవాలయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. మాజీ కార్పొరేటర్ సఫాన్ దేవ్ ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాలుగా సంప్రదాయబద్ధంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.

ఈ వేడుకల్లో భాగంగా ప్రతిరోజూ నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

అనంతరం మహంకాళి దేవాలయ సేవా సమితి సభ్యులకు దేవీ నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

## ఆదిలాబాద్ జిల్లాను 'సురక్షిత్'లో నిలపాలి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**సికె.న్యూస్. ప్రతినిధి..ఆదిలాబాదు:**జిల్లాలోని హెచ్ఐవీ బాధితులందరికీ అవసరమైన ఉచిత మందులు అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో) డైరెక్టర్ జనరల్ డా. రాకేష్ గుప్తా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి వైద్య, సంబంధిత అధికారులతో కలిసి ఆయన హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిస్ ఇండికేటర్ విభాగంలో ఆదిలాబాద్ జిల్లాను 'సురక్షిత్' జాబితాలో నిలపాలని అన్నారు. ఈ సందర్భంగా రక్త నిధి కేంద్రాల ద్వారా స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించి, తగినంత రక్తం నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం పనితీరుపై ఈనెల 27న ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.సాధన, అదనపు వైద్యాధికారి డా.ఈశ్వర్ రాజ్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ నాగరాజు, ఏఆర్‌టీ డాక్టర్ పద్మిని, అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల ఎన్నో ఏళ్ల కల ప్రజాపాలన సీఎం గారి నాయకత్వంలో నెరవేరినది

**మల్దకల్ మండలం ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన ఎమ్మెల్యే**



**సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :**ఈరోజు గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండలం పరిధిలోని దాసరి పల్లి,మల్దకల్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.

దాసరి పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు వెంకటన్న, అశోక్, చిన్న అంజి మరియు మల్దకలల్ మండలం కేంద్రంలో గ్రామానికి చెందిన నర్సింహులు లకు
నేడు ఇల్లు నిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే గారు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది . నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కానుకను అందజేశారు .

ఎమ్మెల్యే కి లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ....

నూతన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన లబ్ధిదారులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరిగింది. వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులను తో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినది.

గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత లో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగినది. దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న. త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలి. ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి తో సాధ్యమైనది అని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహాలు పడాల్సిన అవసరం లేదు ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహాలు వద్దు ఇల్లు రానివారికి ఎవరు కూడా అపోహ పడవద్దండి. రెండో విడతలో త్వరలో కూడా అర్హులైన లబ్ధిదారులు కు మంజూరు ఏవిధంగా కృషి చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి కి గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి కి గద్వాల నియోజకవర్గ ప్రజలందరి తరఫున ధన్యవాదాలు .....

ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ...

ఎన్నో ఏళ్ళు గా మా సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి సారథ్యంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి మాకు చాలా సంతోషంగా ఉన్నది మేము ఎల్లప్పుడూ సీఎం కి మంత్రి కి మా ఎమ్మెల్యే కి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యూనిక్ కంపెనీ పేరుతో భారీ పెట్టుబడి మోసం.. ప్రధాన నిందితుడు అరెస్ట్

- చిట్ ఫండ్స్, అధిక లాభాల పేరుతో వేలాది మందికి టోకరా
- దేశవ్యాప్తంగా సుమారు 10 వేల మంది బాధితులు ఉన్నట్లు ప్రాథమిక అంచనా
- తెలంగాణలో వందల కోట్ల రూపాయల మోసం జరిగినట్లు గుర్తింపు
- ఆదిలాబాద్ జిల్లాలో సుమారు రూ.7--8 కోట్ల మేర లావాదేవీలు
- మోసం చేసిన సొమ్ముతో పలు రాష్ట్రాల్లో హోటళ్లు, భూములు, ప్లాట్ల కొనుగోలు
- తెలంగాణలో 14 కేసులు.. మరో నిందితుడు పరారీలో
- బాధితులు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలి -- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్




**సికె.న్యూస్. ప్రతినిధి ఆదిలాబాద్:**ఆదిలాబాద్, అక్టోబర్ 14: యూనిక్ మర్చంటైల్ ఇండియా లిమిటెడ్, యూనిక్ ఎస్ఎంసీఎస్ సంస్థల పేరుతో చిట్ ఫండ్స్, పెట్టుబడి పథకాల ద్వారా అధిక లాభాలు వస్తాయని ప్రజలను నమ్మించి భారీగా డబ్బులు సేకరించి మోసాలకు పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్ల రూపాయల మోసం జరిగినట్లు, దేశవ్యాప్తంగా సుమారు 10 వేల మంది బాధితులు ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు.

బుధవారం స్థానిక పోలీస్ ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు.

మోసం చేసిన తీరు

నిందితులు యూనిక్ సంస్థల పేరుతో వివిధ పెట్టుబడి పథకాలను ప్రవేశపెట్టి, ఏజెంట్ల ద్వారా ప్రజలను ఆకర్షించినట్లు విచారణలో వెల్లడైంది. వార్షిక చెల్లింపులు, నెలవారీ కిస్తీలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు తదితర పథకాల ద్వారా డబ్బులు సేకరించారు. పెట్టుబడి పెట్టిన మొత్తానికి అదనపు ప్రయోజనాలు కలిపి తిరిగి చెల్లిస్తామని, అవసరమైతే మంచి ప్రాంతాల్లో ప్లాట్లు కేటాయిస్తామని నమ్మించారు.

గడువు పూర్తయినప్పటికీ పెట్టుబడి మొత్తాలు, మెచ్యూరిటీ డబ్బులు తిరిగి చెల్లించకుండా కాలయాపన చేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై ఆదిలాబాద్ వన్‌టౌన్, టూటౌన్, మావల, ఆదిలాబాద్ రూరల్, తలమడుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి.

ప్రాథమిక విచారణ ప్రకారం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈ సంస్థలకు సంబంధించి 14 కేసులు నమోదైనట్లు గుర్తించారు. మెదక్, నిజామాబాద్, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లోనూ కేసులు నమోదైనట్లు సమాచారం ఉందని, ఈ వివరాలపై సంబంధిత రికార్డులను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తుల కొనుగోలుకు మోసం చేసిన సొమ్ము వినియోగం

ప్రజల నుంచి సేకరించిన డబ్బులతో నిందితుడు వివిధ ప్రాంతాల్లో హోటళ్లు, భూములు, ప్లాట్లు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. బెంగళూరు, పశ్చిమ బెంగాల్, జైపూర్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో హోటళ్లు కొనుగోలు చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు.

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో భూములు, ప్లాట్లు కొనుగోలు చేసినట్లు, ముఖ్యంగా మియాపూర్ ప్రాంతంలో సుమారు 400 ప్లాట్లు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. అలాగే బీబీనగర్‌లోని ఎయిమ్స్ పరిసర ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాల భూములు కొనుగోలు చేసినట్లు సమాచారం ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఆస్తుల కొనుగోలుకు ఉపయోగించిన నిధుల మూలాలు, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు కొనసాగుతోంది.

ఆదిలాబాద్ జిల్లా పరిధిలో సుమారు 2,000 మంది సభ్యులతో రూ.7 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు లావాదేవీలు జరిగినట్లు నిందితుడి విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలో బాధితులు కోల్పోయిన మొత్తం, ఇతర ఆర్థిక వివరాలను మరింతగా పరిశీలిస్తున్నారు.

ప్రధాన నిందితుడి అరెస్ట్

తలమడుగు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో విశ్వసనీయ సమాచారం మేరకు అక్టోబర్ 13వ తేదీ రాత్రి ఆదిలాబాద్ కలెక్టరేట్ చౌక్ వద్ద ప్రధాన నిందితుడు రాజ్ కుమార్ రాయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తలమడుగు పోలీస్ స్టేషన్‌కు తరలించి చట్టప్రకారం అరెస్ట్ చేశారు.

నిందితుల వివరాలు

-1: రాజ్ కుమార్ రాయ్ ఏ రాజ్ కుమార్ కైలాష్ రాయ్ (69)

యూనిక్ మర్చంటైల్ ఇండియా లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ / హోల్‌టైమ్ డైరెక్టర్. నివాసం: థల్తేజ్, అహ్మదాబాద్, గుజరాత్ రాష్ట్రం.

స్థితి: అరెస్ట్.

-2: చంద్రశేఖర్

యూనిక్ ఎస్ఎంసీఎస్ సంస్థ జోనల్ మేనేజర్, హైదరాబాద్.

స్థితి: పరారీలో ఉన్నాడు.

గతంలోనూ మోసాలకు పాల్పడినట్లు సమాచారం

నిందితుడు గతంలో మెడికల్ కంపెనీ ఏర్పాటు పేరుతో, హోటళ్లలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మోసాలకు పాల్పడినట్లు సమాచారం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారాలకు సంబంధించిన ఫిర్యాదులు, కేసులు, ఇతర వివరాలను పరిశీలిస్తూ నిందితుడి గత కార్యకలాపాలపైనా దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులు ముందుకు రావాలి

యూనిక్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధితులు ఎవరూ భయపడకుండా సంబంధిత పోలీస్ స్టేషన్లను సంప్రదించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. బాధితులు తమ వద్ద ఉన్న పెట్టుబడి రశీదులు, బ్యాంకు లావాదేవీల వివరాలు, ఒప్పంద పత్రాలు, ఇతర ఆధారాలను పోలీసులకు అందించాలని తెలిపారు.

ఆకర్షణీయమైన పథకాలు, అధిక లాభాల హామీలను నమ్మి పెట్టుబడులు పెట్టే ముందు సంస్థ విశ్వసనీయతను పూర్తిగా పరిశీలించాలని ప్రజలకు సూచించారు. ఈ కేసులో బాధితుల వివరాలను సేకరించడంతో పాటు, నిందితులతో సంబంధం ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపైనా దర్యాప్తు కొనసాగుతోందని ఎస్పీ తెలిపారు.

ఈ సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, రూరల్ సీఐ రహీం పాషా, తలమడుగు ఎస్ఐ డి. రాధిక, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

**సర్వసభ్య సమావేశంలో 18 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం**

**సికె.న్యూస్. ప్రతినిధి. ఆదిలాబాద్:**జిల్లాలోని గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన పఠన వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులు, యువతకు పోటీ పరీక్షల సన్నద్ధతకు అవసరమైన పుస్తకాలు, డిజిటల్ సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. మల్లెపూల నర్సయ్య తెలిపారు.

బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో మొత్తం 18 అంశాలను చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయాల భవన నిర్మాణాలు, స్థలాల కేటాయింపు, పఠన మందిరాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, విద్యుత్ చార్జీలు, ఫర్నిచర్, కంప్యూటర్ పరికరాల కొనుగోలు తదితర అంశాలపై చర్చించారు. జైనథ్, తలమడుగు శాఖా గ్రంథాలయ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధుల ప్రతిపాదనలను ఆమోదించారు. జైనథ్, గుడిహత్నూర్ శాఖా గ్రంథాలయాలకు కేటాయించిన స్థలాలకు సంబంధించి ఆమోదం కోసం సమర్పించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. పౌర పఠన మందిరాల ఏర్పాటుకు చేసిన రూ.3,83,287 వ్యయాన్ని ఆమోదించడంతో పాటు, సామగ్రి కొనుగోలుకు రూ.8 లక్షలు, వార్షిక నిర్వహణకు రూ.4 లక్షల నిధుల ప్రతిపాదనలకు అనుమతి ఇచ్చారు. దాతల విరాళాలతో కంప్యూటర్, ప్రింటర్, ఇన్వర్టర్ తదితర పరికరాల కొనుగోలుకు చేసిన రూ.99,921 వ్యయాన్ని ఆమోదించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కుర్చీలు, అల్మరాలు, టేబుళ్లు, సెప్టిక్ ట్యాంక్ తదితర మౌలిక వసతుల కోసం చేసిన రూ.2,99,250 ఖర్చును, కార్యదర్శి ఛాంబర్‌కు అవసరమైన ఫర్నిచర్ కోసం చేసిన రూ.47,919 వ్యయాన్ని ఆమోదించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కేబిన్ ఏర్పాటుకు ఎంపీ గోడం నగేష్ రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు చైర్మన్ తెలిపారు. అలాగే జిల్లాలోని ఏడు పఠనశాలలకు రూ.1,05,000 విలువైన నిధులు, సామగ్రి అందించేందుకు సంబంధించిన అంశాలను సమావేశంలో పరిశీలించారు. బోథ్ శాఖా గ్రంథాలయానికి దాత అందించనున్న 300 గజాల స్థలం రిజిస్ట్రేషన్, తదితర ఖర్చులను పరిశీలించి, నిబంధనల మేరకు చెల్లింపులు చేపట్టేందుకు కార్యదర్శికి అనుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, గ్రంథాలయాలను కేవలం పుస్తక పఠన కేంద్రాలుగా కాకుండా విద్యార్థులు, యువతకు జ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలు, ప్రశాంతమైన పఠన వాతావరణం, డిజిటల్ వనరులు అందుబాటులో ఉండేలా గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఈఓ మాధవి, డీపీఓ రమేష్, డీపీఆర్ఓ విష్ణువర్ధన్, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. సురేష్ బాబు, డిప్యూటీ లైబ్రేరియన్ కృతిన్ తదితరులు పాల్గొన్నారు.



# పారదర్శకంగా అంగన్వాడీ టీచర్ నియామక ఇంటర్వ్యూలు: జిల్లా కలెక్టర్ రాజర్షిషా



సికె.న్యూస్.ఆదిలాబాద్:అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్ల నియమానికి సంబంధించిన ఇంటర్వ్యూ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. ఇంద్రవెల్లి మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ నియమానికి దరఖాస్తు చేసుకున్న మహిళ అభ్యర్థులకు బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా, శిశు సంక్షేమానికి అంగన్వాడీ కేంద్రాల పాత్ర కీలకమని, వాటిని బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం టీచర్, హెల్పర్ నియామకాలను చేపట్టిందన్నారు. అర్హులైన ప్రతి అభ్యర్థికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ నియామక ప్రక్రియను పకడ్బందీగా చేపట్టామన్నారు. ఇంద్రవెల్లి మండలంలో 9 టీచర్ పోస్టులకు అర్హత సాధించిన 56 మందిలో 48 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 8 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఎంపిక ప్రక్రియలో పూర్తిగా మెరిట్, నిబంధనలకే పెద్దపీట వేసినట్లు ఆయన పునరుద్ఘాటించారు..ఈ ప్రక్రియలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిడబ్లుఓ మిల్కా, డిహెచ్చ్ఓ డా.సాధన, గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షణ అధికారి జగన్, సిడిపిఓలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి - - కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు, పారుపల్లి విజయ్,తలుపుల వెంకటేశ్వర్లు



మధిర అక్టోబర్ 14(సికె న్యూస్)ప్రతినిధి.మధిర మండల, పట్టణ పరిధిలోని అర్హులైన పట్టభద్రులు వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మధిర మండల అధ్యక్షుడు పారుపల్లి విజయ్ కుమార్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు కోరారు.

డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుకు ముందుకు రావాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు పేదల కుటుంబాలకు ఒక వరం



మధిర అక్టోబర్ 14(సికె న్యూస్)ప్రతినిధి.తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు గౌరవ శ్రీ మల్లు భట్టి విక్రమార్క సహకారంతో మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కు ను మధిర తహసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ రాళ్లబండి రాంబాబులిఅధ్యక్షతన ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మధిర మండలం తొండల గోపవరం గ్రామపంచాయతీ పరిధిలో తోర్లపాడు గ్రామానికి చెందిన కాశీబోయిన మహేశ్వరి కి 100116/ రూపాయల చెక్కును అందించిన మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పారుపల్లి విజయకుమార్‌లి మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్‌లి గ్రామ సర్పంచ్ షేక్ కన్నశీసాహెబ్‌లి లు.ఈ సందర్భంగా పారుపల్లి విజయ్ కుమార్ మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ వంటి పథకాలు పేద మధ్యతరగతి కుటుంబాల అప్పుల బాధ నుండి విముక్తి కలిగించుటకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ చెక్కులు రావడానికి కృషి చేసిన గౌరవ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని తెలిపినారు

# డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు,



అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో, అక్టోబర్ 14 (సీ కే న్యూస్) చేగుంట:చేగుంట మండల్, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ బౌద్ధ మతం స్వీకరించిన చారిత్రాత్మక ధమ్మదీక్ష దినోత్సవం (1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్‌లోని దీక్షాభూమిలో బౌద్ధం స్వీకరించిన రోజు) సందర్భంగా బుధవారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు; ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పి. విష్ణు కుమార్ మాట్లాడుతూ.. నవభారత నిర్మాత, దేశ తొలి న్యాయశాఖ మంత్రి డా. బి.ఆర్. అంబేద్కర్ దేశంలోని అన్ని వర్గాల ప్రజల స్వేచ్ఛ, సమానత్వం కోసం అహర్నిశలు పోరాడారని కొనియాడారు; మనువాదులు కులం పేరిట ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటన్నింటినీ అధిగమించి, దేశ ప్రజలందరికీ ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ ఫలాలు అందించిన మహోన్నత మానవతావాది అంబేద్కర్ అని, ఆయన దేశానికి చేసిన సేవలను ప్రపంచ దేశాలు సైతం కొనియాడటం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఎర్ర యాదగిరి, స్టాలిన్ నర్సింలు, బక్క బాబు, బాలేష్, అక్బర్, నరేష్, రాజు, జీవన్, గణేష్, అంజి, నవీన్, ప్రవీణ్, విపుల్, మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపేట బాలల సంరక్షణ గృహంలో బాలికా దినోత్సవం

- బాలికల హక్కులు, రక్షణపై అవగాహన కల్పించిన సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్
- వసతి గృహ విద్యార్థులతో బతుకమ్మ ఆడిన జడ్జ్ విశీద్యా నాయక్, అధికారులు
- బాలికలు ఆత్మవిశ్వాసంతో ఎదగాలి -- జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్



నారాయణపేట జిల్లా అక్టోబర్ 14,(సి కే న్యూస్):నారాయణపేట జిల్లా కేంద్రంలోని బాలల సంరక్షణ గృహంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ ముఖ్య అతిథిగా హాజరై బాలికలకు హక్కులు, రక్షణ, భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా బాలికలకు మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాలను వివరిస్తూ, అనుచిత స్పర్శను గుర్తించడం, అలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు అప్రమత్తంగా ఉండటం, నమ్మకమైన పెద్దలకు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయడం వంటి విషయాలను వివరించారు. బాలికలు తమ భద్రత పట్ల అవగాహనతో ఉండాలని, ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా సహాయం కోరాలని సూచించారు.

**బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలి**

ప్రతి బాలికకు నాణ్యమైన విద్య అందించాలని, బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జడ్జి వింధ్య నాయక్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజేందర్ గౌడ్ లు పిలుపునిచ్చారు. బాలికలపై వివక్ష, వేధింపులు,హింసను సహించకుండా అడ్డుకోవాలని సూచించారు.బాలికల ఆరోగ్యం, పోషణ, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ,వారు తమ లక్ష్యాలను సాధించేలా కుటుంబ సభ్యులు, సమాజం, సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని పేర్కొన్నారు.

బాలికలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించినప్పుడే వారు ఆత్మవిశ్వాసంతో ఎదిగి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలరని తెలిపారు.వసతి గృహ బాల బాలికల తో జడ్జ్ విశీద్యా నాయక్ పూలతో బతుకమ్మ నీ ఎత్తుకొని బతుకమ్మ ఆడారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సలహాదారు లక్ష్మీపతి గౌడ్, బాలల సంరక్షణ గృహ సమన్వయకర్త శివలీల, మద్దూరు శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి, క్షేత్రస్థాయి స్పందన అధికారి సాయి,జిల్లా మహిళా సాధికారత కేంద్ర సమన్వయకర్త నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## అయిజలో కాంగ్రెస్‌కు ఏడుగురు కౌన్సిలర్ల రాజీనామా?

**మంత్రి జూపల్లి, ఎంపీ మల్లు రవిపై నిరసనగా నిర్ణయం?**

సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల అయిజ: జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడుగురు కౌన్సిలర్లు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు సమాచారం. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి బీఆర్ఎస్ నాయకులకు వత్తాసు పలుకుతున్నారనే అసంతృప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు రాజీనామా లేఖలు పంపినట్లు తెలుస్తోంది. అయితే రాజీనామాలపై అధికారిక ధ్రువీకరణ, పార్టీ



నాయకత్వం స్పందన తెలియాల్సి ఉంది.

## 27వ వార్డ్ ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన ఎమ్మెల్యే



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :ఈరోజు గద్వాల జిల్లా కేంద్రంలో 27వ వార్డ్ ఎర్ర మట్టి వీధి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి హాజరయ్యారు.

27వ వార్డ్ చెందిన దౌలు కు మంజూరు కావడం జరిగినది . నేడు ఇల్లు నిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది .

నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కానుకను అందజేశారు .

ఎమ్మెల్యే కి లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూలి ....

నూతన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన లబ్ధిదారులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరిగింది. వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులను తో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినది.

గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత లో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగినది. దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న. త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలి. ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి తో సాధ్యమైనది అని పేర్కొన్నారు.

ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహాలు పడాల్సిన అవసరం లేదు ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహాలు వద్దు ఇల్లు రానివారికి ఎవరు కూడా అపోహ పడవద్దండి. రెండో విడతలో త్వరలో కూడా అర్హులైన లబ్ధిదారులు కు మంజూరు ఏవిధంగా కృషి చేస్తామని తెలిపారు. సీఎం కి గద్వాల్ ఎమ్మెల్యే కి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, విక్రమ్ సింహరెడ్డి, మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్ బాబర్, గోవిందు మాజీ కౌన్సిలర్ తుమ్మల నరసింహులు యాదవ్,మురళి, శ్రీను ముదిరాజ్, మాజీ ఎంపీపీ విజయ్, నాయకులు గోవిందు మైలగడ్డ చంద్రశేఖర్, ధర్మనాయుడు, వెంకటేష్, గాంధీ, వీరేష్, ఎర్ర మట్టి రాజు, నారాయణరెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో గౌరీదేవిగా అమ్మవారి అలంకరణ

**దసరా నవరాత్రి మహోత్సవాల్లో నాలుగో రోజు ప్రత్యేక పూజలు**



సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాగులవంచ శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవాలయంలో నాలుగో రోజు అమ్మవారు గౌరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి పూజలు అందుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. నవరాత్రి ఉత్సవాలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు కి స్వాగతం పలికిన గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి

- బాసు హనుమంతు నాయుడు
- మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్



సి కె న్యూస్ ప్రతినిధి గద్వాల :ఈరోజు జోగులాంబ గద్వాల జిల్లాకి పర్యటన విచ్చేసిన త్రిబుల్ షూటర్ బీఆర్ఎస్ పార్టీ శాసనసభా పక్ష ఉపనేత, మాజీ మంత్రివర్యులు, సిద్ధిపేట శాసనసభ్యులు గౌరవ తన్నీరు హరీష్ రావు కి గద్వాల పట్టణంలోని జమ్మిచేడు దగ్గర పార్టీ శ్రేణులతో కలిసి, బాసు హనుమంతు నాయుడు పూల బొక్కే ఇచ్చి, శాలువాతో ఘనంగా సత్కరించి, స్వాగతం పలికారు....

# బిసి కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం చేసిన షాద్నగర్ ఎమ్మెల్యే

- ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి సహకరించాలి - షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- పర్వతాపూర్ గ్రామంలో మహిళా సంఘ భవనం, బీసీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**షాద్నగర్ నియోజకవర్గం కొందుర్గు సీకే న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 14:** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొందుర్గ్ మండలంలోని పర్వతాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్, మహిళా సంఘ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ గారు పాల్గొని భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారు మాట్లాడుతూ.. పర్వతాపూర్ గ్రామ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. గ్రామానికి ఇప్పటివరకు 37 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతో పాటు, సుమారు రూ.40 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, పైప్‌లైన్ పనులకు నిధులు కేటాయించామని వెల్లడించారు. అలాగే గ్రామంలో 107 వీధి దీపాలను మంజూరు చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామంలో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్, మహిళా సంఘ భవనాలు ఆయా వర్గాల ప్రజలకు ఉపయోగపడతాయని, సామాజిక కార్యక్రమాలకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. పర్యటనలో భాగంగా గ్రామంలో ప్రతిష్ఠించిన శ్రీ దుర్గామాత అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సూచన కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అనిత జితేందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదిక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, సర్పంచులు ఆంజనేయులు, అమర్నాథ్ రెడ్డి, నర్సింహులు, జంగయ్య, రాజ్ కుమార్, శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ అంజిరెడ్డి, మల్లేష్ గౌడ్, పర్వతాపూర్ గ్రామ సర్పంచ్ అశోక్, పీఏసీఎస్ డైరెక్టర్ రత్నమ్మ రాములు, మాజీ డిప్యూటీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామ అధ్యక్షుడు రాకేష్, వార్డు సభ్యులు సరిత నర్సింహులు, పద్మమ్మ మల్లేష్, సునీత అశోక్, డబ్బు నర్సింహులు, నాయకులు శ్యాంసుందర్, జంగయ్య, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్త యువజన సంఘం ఆధ్వర్యంలో లడక బజారులో బతుకమ్మ సంబరాలు

- గౌరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు
- పూల పండుగతో సందడిగా మారిన బజారు





**మధిర అక్టోబర్ 14(సికె న్యూస్)ప్రతినిధి.** మధిర పూల పరిమళాలు.. సంప్రదాయ గీతాలు.. మహిళల కోలాహలం నడుమ మధిర పట్టణంలోని లడక బజారులో బతుకమ్మ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. దేశభక్త యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంబరాలు 5వ రోజుకు చేరుకోగా, బుధవారం సాయంత్రం శ్రీ గౌరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా రామిశెట్టి లక్ష్మయ్య--సునీత, కొట్టే కిరణ్ కుమార్--మౌనిక దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ గీతాలు ఆలపిస్తూ ఉత్సాహంగా ఆడిపాడారు. పూల అందాలు, ఆటపాటలతో లడక బజారు పండుగ కళను సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచిన వేడుకలు భక్తిభావంతో సాగాయి.
పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు అంద చేశారు. కార్యక్రమంలో దేశభక్త యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## వరిగుంతం గ్రామంలో భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు కుంకుమార్చన పూజలు

- అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు.. భక్తితో పాల్గొన్న మహిళలు, భక్తులు



**సి కె న్యూస్ । మెదక్ జిల్లా ప్రతినిధి:** మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో
దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహం పొందాలనే సంకల్పంతో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. పూజా కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, పుష్పాలు, కుంకుమతో అర్చనలు నిర్వహించారు. వేదమంత్రాలు, అమ్మవారి నామస్మరణల మధ్య పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి. కుంకుమార్చన పూజలో మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారికి కుంకుమ సమర్పిస్తూ తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు. లోకకల్యాణం, కుటుంబ సంక్షేమం, ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని దుర్గామాతను వేడుకున్నారు. అమ్మవారి సన్నిధిలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ భక్తిని చాటుకున్నారు. పూజా కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం భక్తి వాతావరణంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని భక్తులు ఆకాంక్షించారు. దుర్గామాత నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించింది.

## ఉమ్మడి ఖమ్మం వరంగల్ నల్లగొండ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు.



**సీకే న్యూస్ ప్రతినిధి :** జనసేన పార్టీ మధిర నియోజకవర్గం ఎమ్మెల్సీ (మీజ)కోఆర్డినేటర్ నల్ల సురేష్ రెడ్డి జనసేన పార్టీ చింతకాని మండలంలో 14వ తారీకు ఉదయం 11 గంటలకు ఈ ఉచిత ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి మధిర నియోజకవర్గం, దామరాజు వెంకట చారి,(గూజ) పి ఓ సి నెంబర్ తాళ్లూరి డేవిడ్ చింతకాని మండల జనసేన పార్టీ అభ్యర్థులు చింతాల నరేష్ వర్మ,షేక్ అమిద్, అలవాల రాంబాబు, చింతాల వెంకటేష్, చెల్లి విష్ణు,మరియు చింతకాని మండల నాయకులు, ముదిగొండ మండలం జనసేన పార్టీ నాయకులు జొన్నలగడ్డ భద్ర, మధిర నియోజకవర్గం సోషల్ మీడియా భరత్ మధిర నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.

# దసరా పండుగకు గ్రామ రహదారుల శుభ్రత.

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు అక్టోబర్ 14.** దసరా పండుగను పురస్కరించుకొని గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ బోడిగే లింగస్వామి గౌడ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చే ప్రజలకు ఆత్మీయ స్వాగతం పలికేందుకు గ్రామ రహదారుల శుభ్రతకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో రహదారులను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పండుగ వేళ గ్రామానికి వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజల సౌకర్యానికి ప్రాధాన్యతనిస్తూ సర్పంచ్ చేపట్టిన చర్యలపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# వ్యవసాయ భూమిలో వృద్ధుడి మృతదేహం గుర్తింపు.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు అక్టోబర్ 14.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేర్చుపల్లి గ్రామ శివారులో బండారి జంగయ్యకు చెందిన వ్యవసాయ భూమిలో బుధవారం ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. పోలీసుల విచారణలో మృతుడు పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన దుబ్బ పెంటయ్య (70)గా గుర్తించారు. ఈ నెల 2వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, వలిగొండ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న మృతుడి చిన్న కుమారుడు దుబ్బ భాస్కర్ మృతదేహాన్ని తన తండ్రిగా గుర్తించగా, పోలీసులు స్పాట్ పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనపై సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేసి, వృద్ధుడి మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పోలంపల్లిలో బతుకమ్మ సంబరాలకు ముందే రోడ్ల మరమ్మత్తులు - సర్పంచ్ ఆధ్వర్యంలో శరవేగంగా పనులు





**అక్టోబర్ 14 (సీకే న్యూస్) చేగుంట:** చేగుంట మండలం పోలంపల్లి గ్రామంలో బతుకమ్మ సంబరాలను పురస్కరించుకుని గ్రామంలో రోడ్ల మరమ్మత్తు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
సర్పంచ్ రాజ్యలక్ష్మి స్వామి, మాట్లాడుతూ,బతుకమ్మపండుగ సందర్భంగా,ఆడపడుచుల,
కోసం ప్రధాన మట్టి రోడ్లు, బతుకమ్మ ఘాట్ కు వెళ్లే దారి, చెరువు కట్ట వద్ద సీసీ రోడ్లను మరమ్మత్తు నిర్వహించారు. గుంతలు పడిన రోడ్లను చదును చేసి, మట్టి పోసి, అవసరమైన చోట పనులు చేపడుతున్నారు. బతుకమ్మ పండుగ నాటికి గ్రామమంతా శుభ్రంగా, అందంగా ఉండేలా చర్యలు చేపడుతామని వారు తెలిపారు,
ఈ పనులను గ్రామస్తులు అభినందిస్తూ.. పండుగ వేళ మట్టి రోడ్లు బాగుచేయడం చాలా సంతోషంగా ఉందని ప్రజలు అన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొండి స్వామి రాజ్యలక్ష్మి, వార్డ్ రాజు,టప్ప భాను,పి నరేందర్,డి సుధాకర్, పంచాయతీ సిబ్బంది సత్తయ్య, ఎల్లం పాల్గొన్నారు,

# గుర్తుతెలియని యువకుని దారుణ హత్య

- సంఘటన స్థలాన్ని సందర్శించిన ఏసీపీలక్ష్మీనారాయణ



**షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు సి కె న్యూస్ ప్రతినిధి అక్టోబర్ 14**
రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం తీగాపూర్ గ్రామ శివారులో గుర్తుతెలియని యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన కొత్తూరు మండలం, తీగపూర్ పంచాయతీ శివారు, డ్రీమ్ మిడాస్ వెంచర్లో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. తీగాపూర్ శివారులో హత్య జరిగినట్లు సమాచారం అందడంతో పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏసిపి లక్ష్మీనారాయణ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తుతెలియని సుమారు 25 ఏళ్ల యువకుడి హత్య జరిగినట్టు సమాచారం అందడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, రక్తం మడుగులో పడిఉన్న మృతదేహం వద్ద క్లూస్ టీం తో కొన్ని ఆధారాలను సేకరించడం జరిగిందని, పూర్తి విచారణ అనంతరం మృతుని వివరాలు, హత్యకు గల కారణాలను వెల్లడించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని షాద్ నగర్ కమ్యూనిటీ అస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వివరించారు. ఏసీపీ వెంట కేశంపేట్ సీఐ శ్రీనివాస్, నందిగామ ఎస్ఐ సుశీల, కొత్తూరు ఎస్ఐ సత్యశీల రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష

అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు కావాలి -- నాయకులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం



**షాద్నగర్ నియోజకవర్గం కొత్తూర్ సి కె న్యూస్ అక్టోబర్ 14:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటరు నమోదు ప్రక్రియపై షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాల వారీగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన పట్టభద్రులందరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఓటరు నమోదు విషయంలో ప్రతి నాయకుడు బాధ్యత తీసుకొని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి ,రాయికల్ శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, సింగిల్ విండో చైర్మన్ అంబటి ప్రభాకర్, సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి, జితేందర్ రెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు బాబు నాయక్, శివరెడ్డి, కౌన్సిలర్ రాజు నాయక్, సి. పెంటయ్య, శ్రీను నాయక్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ చైర్మన్ జాంగారి రవి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్ ,నేతలు జంగయ్య, నీరటి వాసు తదితరులు పాల్గొన్నారు.

## పలు పనులను పరిశీలించిన, కాంగ్రెస్ పార్టీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి,



**అక్టోబర్ 14 (సీ కే న్యూస్) చేగుంట** : చేగుంట మండల కేంద్రంలోనీ గ్రామపంచాయతీ నిధులతో నూతనగా 14వ వార్డులో నిర్మిస్తున్న సిసి రోడ్, అండర్ గ్రౌండ్ పనులను కాంగ్రెస్ పార్టీ దిబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి చేగుంట గ్రామ సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ తో కలిసి, సిసి రోడ్డు మరమ్మతులు పరిశీలించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి తమ లక్షమని పట్టణ లో ఉన్న ప్రతి వార్డ్ ను అభివృదే తమ లక్ష్యమని తెలిపారు, ఈ కార్యక్రమం లో సర్పంచ్ స్రవంతి సతీష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, వార్డ్ సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, సినియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తాటిబెలం టీ కాఫీ సెంటర్ ప్రారంభించిన, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**అక్టోబర్ 14 (సీ కే న్యూస్) చేగుంట** :చేగుంట మండల కేంద్రంలో ఇబ్రహీంపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు స్వామి, నూతనంగా ఏర్పాటు చేసిన మదురై తాటిబెలం కాఫీ సెంటర్ ను ముఖ్య అతిథి దుబ్బాక నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు, అనంతరం నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి ని శాల్వతో సన్మానించారు,ఈ కార్యక్రమం చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ ఛైర్మెన్,వివిధ గ్రామ సర్పంచ్ లు,ఎఎంసి డైరెక్టర్లు, స్టాలిన్ నర్సింలు, అన్నం ఆంజనేయులు, మొజామిల్, దొంతి రెడ్డి బాల్ రెడ్డి,కాశబోయిన శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కోండి శ్రీనివాస్,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మాసాయిపేట శ్రీనివాస్, ఇబ్రహీంపూర్ ఉప సర్పంచ్ చౌదరి శ్రీనివాస్,సీనియర్ నాయకులు పుర్ర ఆగం, యువ నాయకులు సంద్రుగు శ్రీకాంత్,దుబ్బాక నియోజవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ప్రఫుల్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్,గ్రామ కాంగ్రెస్ నాయకులు,తయాబ్,నాగులు,నవీన్ నాయక్,సంతోష్,కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హనుమకొండ కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు -- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన వేడుకలు!





**హనుమకొండ, అక్టోబర్ 14:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఈరోజు హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు, మహిళల సంప్రదాయ వస్త్రధారణ, ఉత్సాహభరితమైన వాతావరణం ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ వేడుకల్లో ఉద్యోగులు, మహిళా సిబ్బంది, ఇతర అధికారులు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పారు. పూల పండుగైన బతుకమ్మ మహిళల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు, మన సంస్కృతి పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని ఈ వేడుకలు మరోసారి చాటిచెప్పాయి.

**ఉద్యోగుల్లో ఉత్సాహం నింపిన బతుకమ్మ సంబరాలు**

ప్రభుత్వ కార్యాలయాల్లో విధి నిర్వహణలో నిరంతరం నిమగ్నమయ్యే ఉద్యోగులకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నూతన ఉత్సాహాన్ని అందిస్తాయి. ఉద్యోగుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు పరస్పర సహకారం, ఐక్యత, సానుకూల దృక్పథాన్ని బలోపేతం చేస్తాయి.

ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైనది. విధి నిర్వహణతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ఇలాంటి పండుగలను సమష్టిగా జరుపుకోవడం అభినందనీయమని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

**తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ**

బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదు.. అది తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మనకున్న అనుబంధానికి, మన సంస్కృతీ సంప్రదాయాల గొప్పతనానికి ప్రతీక. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత.

హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాలు ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపడమే కాకుండా, తెలంగాణ సంస్కృతిని కాపాడుకోవాలనే స్ఫూర్తిని చాటిచెప్పాయి.

ప్రభుత్వ ఉద్యోగులందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు. విధి నిర్వహణలో మరింత ఉత్సాహంతో, ప్రజాసేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగుతూ, మన తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందాం!

# వరిగుంతంలో వైభవంగా మహాచండీయాగం!



**కూష్మాండ దుర్గ రూపంలో దర్శనమిచ్చిన మహాచండీ దేవి**

**సీకే న్యూస్ ప్రతినిధి -- మెదక్ జిల్లా కొల్చారం**

వరిగుంతం: మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో కొనసాగుతున్నాయి. గ్రామంలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో దుర్గా భవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవీ నవరాత్రి మండపంలో గురువారం నాలుగో రోజు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మాత మహాచండీ దేవి కూష్మాండ దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమివ్వడంతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సామూహికకూష్మాండ దుర్గ రూపంలో దర్శనమిచ్చిన మహాచండీ దేవి

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో సామూహిక మహా చండీ యోగం లో కార్యక్రమాన్ని భక్తిపూర్వకంగా నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేదమంత్రోచ్చారణలు, అమ్మవారి నామస్మరణ, భక్తుల ప్రార్థనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

మహా చండీ యజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన దంపతులు

వడ్ల బ్రహ్మచారి, సంతోష్, అవుసుల సతీష్ చారి, రక్షా, అరిగె అశోక్, జ్యోష్ణ తదితరులు సామూహిక మహా చండీ యజ్ఞంలో పాల్గొని పూజలు చేశారు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కూష్మాండ దుర్గాదేవి విశిష్టత

దేవీ నవరాత్రుల్లో నాలుగో రోజు పూజలందుకునే అమ్మవారిని కూష్మాండ దేవిగా ఆరాధిస్తారు. జగత్తుకు శక్తిని ప్రసాదించే ఆదిపరాశక్తి స్వరూపంగా భక్తులు అమ్మవారిని కొలుస్తారు. అమ్మవారి అనుగ్రహంతో కుటుంబాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ పవిత్ర సందర్భంలో భక్తులు కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి తమ కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.

మహాచండీయాగంతో లోకకల్యాణానికి ప్రార్థనలు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాచండీయాగం నిర్వహించడం విశేషంగా నిలిచింది. అమ్మవారి అనుగ్రహం కోసం నిర్వహించే చండీయాగాన్ని భక్తులు అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమంగా భావిస్తారు. లోకకల్యాణం, గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, పాడిపంటల అభివృద్ధి, సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు.

అమ్మవారికి ఎరుపు రంగు వస్త్రాలు, వివిధ రకాల సుగంధ పుష్పమాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, మహాప్రసాదాన్ని పంపిణీ చేశారు.

భక్తులతో కళకళలాడిన ఆలయ ప్రాంగణం

దుర్గా భవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి వేడుకలకు గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి సేవలో తరించారు. భక్తుల రాకతో హనుమాన్ దేవాలయ ప్రాంగణం సందడిగా మారింది.

నవరాత్రి ఉత్సవాలు గ్రామంలో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్నాయని భక్తులు పేర్కొన్నారు. అమ్మవారి కృపతో గ్రామం సుఖశాంతులతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

# బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్**



**సీకే న్యూస్ ఖమ్మం ప్రతినిధి ఇస్లావత్ నరసింహ అక్టోబర్ 15 2026:** ఏన్కూరు రామాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాన్ని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసి, భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు సంబరాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడటంతో వేడుకల్లో సందడి నెలకొంది. ఆలయ ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది.

ఈ కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు,భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# పైడితల్లి అమ్మవారి నూతన దేవాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం.

**చిట్టవలస గ్రామంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అచ్చెన్నాయుడు.**





**కోటబొమ్మాళి, సీకే న్యూస్ అక్టోబర్ 14:** సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన చిట్టవలస గ్రామం లోని పైడితల్లి అమ్మవారి నూతన దేవాలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం భక్తి శ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పవిత్ర మహోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరి పై ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, అమ్మవారి పునఃప్రతిష్ఠ మహోత్సవంలో గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలను పొందారు. తరతరాలుగా గ్రామ ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న పైడితల్లి అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ వేడుకలు గ్రామ ప్రజల్లో భక్తి భావాన్ని, ఐక్యతను మరింత పెంపొందించాయి. భక్తుల జయజయధ్వానాలు, సంప్రదాయబద్ధమైన పూజా కార్యక్రమాల మధ్య జరిగిన ఈ మహోత్సవం చిట్టవలస గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపింది. పైడితల్లి అమ్మవారి దివ్య ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యాలు కలగాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సర్పంచ్ అభ్యర్థిని సంపతిరావు భారతమ్మ తో పాటు గ్రామ ప్రముఖులు మెట్ట సూర్యనారాయణ, కురుకుల శ్రీను, కురుకుల నారాయణరావు, మెట్ట ప్రసాదరావు, చింతాడ గౌరినాయుడు, దుంపల ముత్యాలరావు, బొడ్డేపల్లి వేణు, సంపతిరావు లోకనాథం మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతికి స్వాగతం పలికిన పెమ్మసాని.



**విజయవాడ, సీకే న్యూస్ అక్టోబర్ 14:** జాతీయ స్థాయి సరస్ అజీవికా మేళా ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు విజయవాడకు విచ్చేసిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ విజయవాడ విమానాశ్రయంలో బుధవారం సాదర స్వాగతం పలికారు. అక్టోబర్ 15 వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు నిర్వహించినున్న ఈ మేళాలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించబోతున్నారు. గ్రామీణ మహిళల నైపుణ్యాలు, సృజనాత్మకత, వ్యాపార సామర్థ్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో సరస్ అజీవికా మేళాను నిర్వహిస్తున్నారు. ఈ మేళా ద్వారా వివిధ రాష్ట్రాల సంప్రదాయ ఉత్పత్తులు, హస్తకళలు, ఆహార పదార్థాలు, మహిళా సంఘాల విజయగాథలు ప్రజలకు పరిచయం కానున్నాయి. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడం, వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడటం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సరస్ మేళాలో పాల్గొంటున్న మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు, గ్రామీణ మహిళా సాధికారత ప్రాధాన్యతను మరింతగా చాటనుంది.